Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు
# RAJADHANI VARTALU




అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 293 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily) మంగళవారం, 7 - 7 - 2026


94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

## - పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో జీరో వేస్ట్ లక్ష్యం - రియల్ టైమ్ గవర్నెన్సు నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష







**అమరావతి, (రాజధాని వార్తలు):** రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలి. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు భాద్యత తీసుకోవాలి." అని అన్నారు.

**మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగింపు**

గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్ల ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని...గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని సీఎం నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారు చేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దుష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం అన్నారు. మున్సిపాలిటీలు, కార్పోరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి పెద్ద పీట**

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్ధిక, ఆర్ధికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కోనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించటంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జర్నలిస్టుల హౌసింగ్ నిర్మాణం వెంటనే చేపట్టాలి - ముఖ్యమంత్రికి సీనియర్ జర్నలిస్టుల విజ్ఞప్తి

**విజయవాడ, (రాజధాని వార్తలు):** అమరావతి రాజధానిలో జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని వివిధ పత్రికలు మరియు ఎలక్ట్రానిక్ మీడియాలకు చెందిన సీనియర్ జర్నలిస్టులు కోరారు. ఆదివారం ఇక్కడ అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు ఈ మేరకు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2019లో జర్నలిస్టుల హౌసింగ్ నిర్మాణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎం ఎస్ నెంబర్ 67 ద్వారా 30 ఎకరాల భూమిని అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి కేటాయించింది. ఆ భూమిలో సిఆర్డీఏ ఆధ్వర్యంలో బహూళ అంతస్థుల గృహ సముదాయాలను నిర్మించేలా సొసైటీ అధికారికంగా ఒప్పందం చేసుకుని తిరిగి ఆ భూమిని ప్రభుత్వానికి ఇవ్వటం జరిగింది. అందులో భాగంగా నాలుగు కేటగిరీలలో జర్నలిస్టులకు అపార్ట్మెంట్ లు నిర్మించేలా ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 107ను విడుదల చేసింది. హ్యాపీనెస్ట్ మోడల్‌లో జర్నలిస్టుల కోసం అపార్ట్మెంట్‌లు నిర్మిస్తామని ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇప్పుడు అమరావతిలో హ్యాపీనెస్ట్ తో పాటు అనేక ప్రాజెక్టులు నిర్మాణం జరుతున్నందున వెంటనే ప్రభుత్వం జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్ట్‌ను కూడ ప్రారంభించాలని ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు అభ్యర్థిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

**ఇతర తీర్మానాలు:**

1) విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం పట్ల కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేయటం జరిగింది. 2) రాష్ట్ర ప్రభుత్వం రాజధాని పనులలో అనేక అవరోధాలను అధిగమిస్తూ వేగవంతంగా పూర్తి చేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేయటం జరిగింది. 3) అమరావతిలో వివిధ కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్న ఆయా ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల యాజమాన్యాలను స్వాగతించటం జరిగింది. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ప్రత్యేక పరిస్థితుల్లో నూతనంగా రాజధాని కోసం అవసరమైనంత భూమి సేకరించటంతో పాటు ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలకు భూమి కేటాయించడం, వివిధ వర్గాల






తో పాటు జర్నలిస్టులకు గృహ నిర్మాణ సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించడం అభివృద్ధిదాయకంగా భావిస్తున్నాం. 4) అమరావతిలో సొంత గృహాలను నిర్మించుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మున్సిపల్ మంత్రి నారాయణని అభినందించటం జరిగింది. 5) నిత్యం అమరావతి రాజధానితో అక్కడ జరిగే అభివృద్ధి పనులతో మమేకమై పని చేస్తున్న జర్నలిస్టుల గృహనిర్మాణ నిమిత్తం గతంలో ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులను సత్వరమే అమలు చేయాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ఇందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరటం జరిగింది. 6) 2019లో అమరావతి జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి 30 ఎకరాలు భూమిని కేటాయించగా ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి అంటే సిఆర్డీఏకు ఇచ్చివేసి నాలుగు కేటగిరీలలో బహూళ అంతస్తుల నివాస సముదాయాన్ని నిర్మించే విధంగా అధికారికంగా ఒప్పందం చేసుకోవటం జరిగింది. ఇందుకు ప్రతిగా ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబర్ 107ను విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారం మరియు ఆదేశాలతోనే జరిగింది. దీనిపై సత్వరమే ప్రభుత్వం స్పందించాల్సిన ఆవశ్యకతను వివరించటం జరిగింది. 7) అమరావతిలో జర్నలిస్టుల కోసం ఉద్దేశించిన హౌసింగ్ ప్రాజెక్టును హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు మోడల్‌లో నిర్మించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న అంశాన్ని గుర్తు చేసింది. ఇప్పుడు హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు కూడ ప్రారంభమైనందున వెంటనే జర్నలిస్టుల హౌసింగ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరింది. 8) రాజధానిలో ఇప్పటికే పేదలకు 2000 ఇళ్ళ నివాస సముదాయాన్ని మధ్య తరగతి మరియు ఆపై తరగతుల కోసం హ్యాపీనెస్ట్‌ను, ఎన్‌ఆర్‌ఐల కోసం ఎపిఎన్ఆర్టీ అమరావతి ఐకాన్ ప్రాజెక్టులను నిర్మిస్తూ ఐఎఎస్ మరియు ఐపిఎస్ అధికారులకు ఇళ్ళ స్థలాలను కేటాయించిన ప్రభుత్వం జర్నలిస్టుల విషయంలో కూడా అదే సమన్యాయంతో సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేసింది. 9) 2019-2024 మధ్యకాలంలో అనేక మంది జర్నలిస్టులు పదవీ విరమణ చెందటం లేదా కరోనా సమయంలో మరణించటం జరిగిందని వారందరూ గతంలో హౌసింగ్ ప్రాజెక్టులో భాగస్వాములైనందున ఇప్పుడు ఆ కుటుంబాలు కూడ ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తున్నాయని తెలిపింది. 10) ప్రజా రాజధానిగా అమరావతి అభివృద్ధి చెందడంలో జర్నలిస్టుల పాత్ర విస్మరించలేనిదని ఆర్థికంగా దిగువశ్రేణిలో ఉన్న వారి జీవితానికి ఎంతో ముఖ్యమైన గృహ నిర్మాణ కలను సాకారం చేయాలని ముఖ్యమంత్రికి సమావేశం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. 11. ప్రపంచశ్రేణి రాజధాని నిర్మిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచలో మరెక్కడా లేని విధంగా గొప్ప జర్నలిస్టు కాలనీ నిర్మించాలనేది మా ఆకాంక్ష.

**సమావేశంలో పాల్గొన్న వారి వివరాలు:**

అమరావతి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి పాటిబండ్ల నాగశ్రీనివాసరావు, డైరెక్టర్లు చావా రవి, ఈశ్వర్ (టివి-9) నరసింహరావు (హెచ్ ఎం టివి), శ్రీనివాసే (మహాటివి), హిందూ డిప్యూటీ ఎడిటర్ శ్రీనాథ్, స్పెషల్ కరస్పాండెంట్ సాంబశివరావు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ డిప్యూటీ రెసిడెంట్ ఎడిటర్ మల్లేశ్వరరావు, సీనియర్ సబ్ ఎడిటర్ అమీన్, ఈనాడు సీనియర్ రిపోర్టర్ ఎం శ్రీనివాసరావు, ఈటీవీ బ్యూరో చీఫ్ శ్రీనివాస మోహన్, ఆంధ్రప్రభ బ్యూరో చీఫ్ గోపీ, బిబిసి ఇన్‌ఛార్జి జి ఉమాకాంత్, టైమ్స్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ ఎడిటర్ శ్రీకాంత్, ఎన్టీవి చీఫ్ రిపోర్టర్ ప్రసన్న, మహాటివి ఏపి బ్యూరోచీఫ్ మురళీమోహన్, విశాలాంధ్ర మాజీ ఉపసంపాదకుడు ఎస్ కె బాబు, దిశ సీనియర్ జర్నలిస్ట్ దారం వెంకటేశ్వరరావు, సివిఆర్ బ్యూరో ఏడుకొండలు, సహకార భూమి ఎడిటర్ అక్బర్ పాషా, ఆంధ్రభూమి మాజీ న్యూస్ ఎడిటర్ నరసింహారావు, వార్త బ్యూరో చీఫ్ గంటా విజయ్ కుమార్, పయినీర్ ఇన్చార్జి బొప్పన రవి, ప్రజాశక్తి స్టేట్ బ్యూరో పవన్, డెక్కన్ క్రానికల్ మాజీ బ్యూరో ఇన్చార్జి కృష్ణారావు, ఫోటోగ్రాఫర్లు దయానంద్, వెంకట్రామయ్య, ఆంధ్రపత్రిక సిఇవో మాధవ్, 99 టివి బ్యూరో జి సాంబశివరావు, సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్టు శ్రీధర్ తదితరులు హాజరవ్వగా మరి కొంతమంది జర్నలిస్టులు సందేశాలు తమ సంఘీభావాన్ని తెలిపారు.




# ఏపి హైకోర్టులో ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ప్రమాణ స్వీకారం







**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానంలో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడి అలియాస్ సీహెచ్ పురుషోత్తమ కుమార్‌లు సోమవారం ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాల్లో అదనపు న్యాయమూర్తులుగా సునీత గంధం, ఆలపాటి గిరిధర్, పురుషోత్తమ్ కుమార్ చింతలపూడిలచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర హైకోర్టుకు ముగ్గురు అదనపు న్యాయమూర్తుల నియామకానికి ఏపీ ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నియామకాలతో ఏపీ హైకోర్టులో మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 29 నుంచి 32కు చేరింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు ఫుల్ బెంచ్ న్యాయమూర్తులు, బార్ కౌన్సిల్ ప్రతినిధులు, హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయాధికారులు, రిజిస్ట్రార్లు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# కాశీలో ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల దర్శనంతో పరవశించిన జైనగర్ జిల్లా విహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు పద్మావతి



**వారణాసి, (రాజధాని వార్తలు):** పవిత్ర కాశీ క్షేత్రంలో జైనగర్ జిల్లా విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి.) ఉపాధ్యక్షురాలు పద్మావతి సోమవారం ఆధ్యాత్మిక యాత్రను అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగించారు. ఉదయం వేళ కాశీ మహిమాన్విత పుణ్యక్షేత్రాలలోని కాలభైరవ స్వామి ఆలయం, మహా మృత్యుంజయ మహాదేవాలయం, అలాగే విశిష్ట ప్రాధాన్యం కలిగిన ధన్వంతరి బావిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు స్వీకరించి దేశ ప్రజల సుఖశాంతులు, సనాతన ధర్మ పరిరక్షణ, సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం పవిత్ర గంగానదిలో స్నానమాచరించి గంగామాతకు ప్రత్యేక ప్రార్థనలు సమర్పించారు. గంగాస్నానం ద్వారా ఆధ్యాత్మిక ప్రశాంతత, అంతరంగ పవిత్రత కలుగుతుందనే విశ్వాసంతో భక్తిపూర్వకంగా పుణ్యస్నానం నిర్వహించారు. సాయంత్రం గంగాతీరంలో జరిగిన వైభవోపేత గంగా హారతి కార్యక్రమాన్ని తిలకించారు. వేదమంత్రాల నడుమ దీపారాధనలతో, గంటానాదాలు, శంఖధ్వనులతో, భక్తిగీతాల మధ్య సాగిన గంగా హారతి ఆమెను ఆధ్యాత్మిక అనుభూతిలో ముంచెత్తింది. వేలాది మంది భక్తులతో కలిసి గంగామాతకు హారతి సమర్పిస్తూ దివ్యమైన వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ సందర్భంగా జైనగర్ జిల్లా విహెచ్‌పీ ఉపాధ్యక్షురాలు పద్మావతి మాట్లాడుతూ, కాశీ విశ్వనాథుని క్షేత్రం, కాలభైరవ స్వామి, మహా మృత్యుంజయేశ్వరుని దర్శనం జీవితంలో మరపురాని అనుభూతిని కలిగించాయని తెలిపారు. పవిత్ర గంగాస్నానం, గంగా హారతి దర్శనం మనసుకు అపూర్వమైన ప్రశాంతతను ప్రసాదించాయని, ప్రతి హిందువు జీవితంలో కనీసం ఒక్కసారైనా కాశీ యాత్ర చేయాలని ఆకాంక్షించారు. ఈ పుణ్యయాత్ర తనలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంపొందించిందని పేర్కొంటూ, దేశంలో ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాశీ యాత్ర ద్వారా పొందిన దైవానుభూతి జీవితాంతం స్ఫూర్తినిస్తుందని ఆమె పేర్కొన్నారు.

# రహదారులపై రాంగ్-రూట్ మరణమృదంగం: క్షణకాలపు బద్ధకానికి అమాయకులు బలి!

## - రాంగ్-సైడ్ డ్రైవింగ్.. షార్ట్‌కట్ అనుకుంటే అది నేరుగా యమపురికే!

భారతీయ రహదారులపై ప్రయాణం రోజురోజుకూ ఒక ప్రమాదకరమైన సాహసయాత్రగా మారుతోంది. మితిమీరిన వేగం, సిగ్నల్ జంపింగ్‌ల కంటే భయంకరమైన మహమ్మారి ఒకటి ప్రస్తుతం మన రోడ్లను పట్టిపీడిస్తోంది. అదే-రాంగ్-సైడ్ డ్రైవింగ్ (తప్పుడు దిశలో వాహనాలు నడపడం). కొద్ది దూరం ప్రయాణించి యూ-టర్న్ తీసుకోవడానికి బద్ధకించి, రోడ్డుకు అవతలి వైపు నిబంధనలను ఉల్లంఘిస్తూ రాంగ్ రూట్‌లో దూసుకురావడం నేడు ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. ముఖ్యంగా యువత (జెన్ జీ) ఈ ప్రమాదకరమైన అలవాటును ఒక వీరత్వంగా భావిస్తుండటం అత్యంత ఆందోళనకరం. ఎదురుగా సరైన దిశలో, నియమబద్ధంగా వచ్చే వాహనదారులకు ఈ రాంగ్-రూట్ డ్రైవర్లు ఒక ఊహించని మృత్యుపాశంలా మారుతున్నారు.

**రాంగ్-సైడ్ డ్రైవింగ్: ఒక సామాజిక విపత్తు**

క్షణకాలపు బద్ధకం - జీవితాంతం శోకం: కేవలం రెండు నిమిషాల సమయాన్ని లేదా కొద్దిగా పెట్రోల్‌ను ఆదా చేసుకోవడం కోసం వందలాది మంది ప్రాణాలను పణంగా పెడుతున్నారు. హైవేలపై కూడా రివర్స్ దిశలో వాహనాలను నడపడానికి వెనుకాడటం లేదు.

హై-స్పీడ్ క్రాషెస్ (తీవ్రమైన ప్రమాదాలు): సరైన దిశలో వేగంగా వచ్చే వాహనదారుడికి, ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాన్ని అకస్మాత్తుగా నియంత్రించడం సాధ్యం కాదు. దీనివల్ల జరిగే ప్రమాదాలు అత్యంత ఘోరంగా ఉండి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయేలా చేస్తున్నాయి.

బాధ్యతారాహిత్యమే ఫ్యాషన్: ట్రాఫిక్ పోలీసులు లేని చోట, కెమెరాలు లేని జంక్షన్లలో రాంగ్-రూట్ డ్రైవింగ్ చేయడం తమ హక్కు అన్నట్లుగా కొంతమంది ప్రవర్తిస్తున్నారు. చట్టాన్ని గౌరవించడం చిన్నతనమనే భావన యువతలో పెరిగిపోతోంది.

నివారణోపాయాలు: కఠిన చర్యలే ఏకైక మార్గం

ఈ రహదారి అరాచకత్వానికి స్వస్తి చెప్పాలంటే కేవలం జరిమానాలతో సరిపెడితే లాభం లేదు:

1. క్రిమినల్ కేసులు నమోదు చేయాలి: రాంగ్-సైడ్ డ్రైవింగ్‌ను కేవలం సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘనగా కాకుండా, "ఉద్దేశపూర్వకంగా ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించే" తీవ్రమైన నేరంగా పరిగణించి క్రిమినల్ కేసులు పెట్టాలి.
2. లైసెన్స్ శాశ్వత రద్దు: తప్పుడు దిశలో వాహనం నడుపుతూ పట్టుబడితే మొదటిసారికే డ్రైవింగ్ లైసెన్స్‌ను కనీసం ఏడాది పాటు సస్పెండ్ చేయాలి, రెండోసారి పునరావృతమైతే శాశ్వతంగా రద్దు చేయాలి.
3. ఆటోమేటిక్ నెంబర్ ప్లేట్ రికగ్నిషన్ : నగరాల్లోనే కాకుండా జాతీయ రహదారులపై కూడా రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలను గుర్తించి, ఆటోమేటిక్‌గా భారీ చలాన్లు జనరేట్ అయ్యేలా అత్యాధునిక నిఘా వ్యవస్థను బలోపేతం చేయాలి. రహదారి అనేది అందరిది. మన బద్ధకం లేదా అహంకారం వేరొకరి కుటుంబంలో శాశ్వత చీకట్లను నింపకూడదు. కొద్ది దూరం ఎక్కువ ప్రయాణించినా పర్వాలేదు కానీ, సురక్షితంగా గమ్యాన్ని చేరడమే ముఖ్యం. 'జెన్ జీ' యువత, ప్రతి ఒక్క వాహనదారుడు ఇకనైనా ఈ "రాంగ్-సైడ్ భ్రమ" నుండి బయటపడాలి. రూల్స్ పాటించడం బలహీనత కాదు, అది మీ, మీ తోటి సమాజపు ప్రాణాల రక్షణ కవచం అని గుర్తించాలి. రహదారి నిబంధనలను గౌరవిద్దాం - ప్రాణాలను కాపాడుకుందాం!

# మైనర్ బాలిక హత్యాచార ఘటనపై దర్యాప్తు చేపట్టాలి...!

## - వైసీపీ మహిళా నేతలు డిమాండ్

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** పెద్దాపురం డివిజన్లో ఒక మైనర్ బాలికపై అత్యాచార ఘటన జరిగినట్లు వస్తున్న వార్తల వ్యవహారంపై ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేపట్టాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళ నేతలు డిమాండ్ చేశారు. సామర్లకోట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ దవులూరి దొరబాబు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పెద్దాపురంలో ఒక మైనర్ బాలికపై జరిగిన ఘటనలో నేతలు, పోలీసుల పాత్రపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలన్నారు. పెద్దాపురం ఎస్సై మౌనిక బదిలీపై కూడా మహిళ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. మైనర్ బాలిక ఘటనలో ప్రధానంగా లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు పెద్ద ఎత్తున దూమరం చెలరేగటం ప్రభుత్వ వైఫల్యానికి దర్పణం అని శివకుమారి ధ్వజమెత్తారు. మహిళల రక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పెద్దాపురం ఘటన కనిపించలేదా అంటూ మహిళ నేత మాకినీడి శివకుమారి ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలకు రక్షణ లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. పెద్దాపురం ఘటనకు సంబంధించి ఆ కుటుంబాన్ని కూడా మాయం చేయటం విచిత్ర మని మహిళా నేత వర్ధినిడి సుజాత అన్నారు. ఒక కోళ్ల ఫారం యజమాని చేసిన దాష్టీకాన్ని కప్పిపుచ్చేందుకు పోలీసుల ద్వారా ప్రయత్నాలు సాగు తున్నట్లు కూడా మహిళా నేతలు ఆరోపించారు. హోమంత్రి అనిత కూడా ఈ ఘటనపై స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బాధిత కుటుంబాన్ని గుర్తించి, బాధితులకు అండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం సాగిస్తుందని మహిళ నేతలు స్పష్టం చేశారు.



**బీచ్‌లో మద్యం వ్యాపారమా...?**

సమాజానికి మంచి సందేశాత్మకంగా వ్యవహ రిస్తూ, మహిళలకు రక్షణ కల్పించవలసిన ప్రభుత్వమే బీచ్ ప్రాంతాల్లో మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహి స్తుందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి పాలన వ్యాపార కేంద్రంగా మారుతుందన్నారు. కుటుంబ సమేతంగా బీచ్‌కు వెళ్లే ప్రజలు మహిళలకు రక్షణ ఎక్కడ లభిస్తుంది అంటూ ప్రశ్నించారు. బీచ్‌లో మద్యం అమ్మకాలు, ఇతర దుకాణాలు ఏర్పాటుపై ప్రభుత్వం తక్షణమే పున: పరిశీలన చేయాలని కూడా డిమాండ్ చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోరాటం సాగిస్తుందని కూడా హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళ నేతలు శివ ప్రసన్న, పేపకాయల కృష్ణప్రియ, దీప్తి కుమారి, సేపెని రూపాదేవి, పాలిక కుసుమ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో అక్షర యజ్ఞం... 'యాదవ వీర భారతం' గ్రంథ ఆవిష్కరణ





**కందుకూరు, (రాజధాని వార్తలు):** యాదవ జాతి వీరత్వానికి, త్యాగానికి నిదర్శనమైన ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో మరియు పాలేటి గంగమ్మ తల్లి సన్నిధిలో, అత్యంత పవిత్రమైన రీతిలో 'యాదవ వీర భారతం – కాటమరాజు చరిత్ర' పుస్తకాన్ని అమ్మవారికి మరియు శ్రీ కాటమరాజు స్వామి వారికి కైంకర్యం చేసి, ఘనంగా సమర్పించడం జరిగింది. ఈ చారిత్రక ఘట్టంలో భాగంగా, యాదవ వంశానికి చెందిన మూడు తరాల పూజారులు పాలేటి గంగమ్మ వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అమ్మవారికి పుస్తక కైంకర్యం జరిపించారు. అనంతరం భక్తులు, ప్రముఖుల సమక్షంలో వైభవంగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఏ పి.ఏం.పి. ఏ. రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ ఈ 'యాదవ వీర భారతం' కేవలం అక్షరాల కూర్పు కాదని. ఎనిమిది వందల ఏళ్లుగా జానపదుల గుండెల్లో, కమ్మూ వాయిద్యాల శబ్దాల్లో మారుమ్రోగుతున్న మన పూర్వీకుల వీరగాథలకు ఇది అక్షర రూపమని. వై.ఎస్. యాదవ్ తన తండ్రి అసంపూర్ణ స్వప్నాన్ని, యాదవ జాతి ఆత్మగౌరవ ప్రతీకగా మలచడం అభినందనీయమని అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ సెక్రటరీ జనరల్ సెక్రెటరీ దొడ్డక ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ ఏ నేల మీదైతే మన వీరులు ధర్మం కోసం, గోసంరక్షణ కోసం తమ నెత్తుటిని చిందించారో... ఆ ఎర్రగడ్డపాటి రణక్షేత్రంలో, పాలేటి గంగమ్మ తల్లి సాక్షిగా ఈ పుస్తకాన్ని సమర్పించడం సముచితమని, ఇది కేవలం పుస్తకావిష్కరణ కాదు, మన మూలాలకు మనం చేస్తున్న వందనమని అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షులు బోట్ల రామారావు యాదవ్ మాట్లాడుతూ మార్కాపురం ప్రాంతంలో కాటమరాజు జరిపిన సమరం చారిత్రాత్మకమైనదని. ఆ ప్రాంతానికి 'కాటమరాజు జిల్లా'గా నామకరణం చేయాలనేది ఈ జిల్లా వాసుల చిరకాల వాంఛ అని, ఈ పుస్తకం ఆ పోరాటానికి బలమైన చారిత్రక ఆధారాలను అందిస్తుందని. మన చరిత్రను మనము గౌరవించుకుంటేనే, రేపటి తరం మనల్ని గుర్తుంచుకుంటుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథ రచయిత వై.ఎస్. యాదవ్ మాట్లాడుతూ, యాదవుల వీరత్వాన్ని, త్యాగాలను అక్షరబద్ధం చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను సగర్వంగా అందిస్తున్నామని, ఈ పుస్తకం త్వరలో ప్రపంచ వ్యాప్తంగా అన్ని ఆన్లైన్ స్టోర్లలో అందుబాటులోనికి వస్తాయని, లేదా 8374096999 నెంబర్ నందు సంప్రదించిన కొరియర్ ద్వారా పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దొర్నాల ఎంపీపీ పద్మజ యల్లేష్ యాదవ్, సీనియర్ న్యాయవాది భారతాల మల్లికార్జునరావు యాదవ్, పాలేటి గంగమ్మ ఆలయ కైంకర్యదారులు, కాటమరాజు చరిత్ర పరిశోధకులు వేణు యాదవ్, సన్నిబోయిన గంగాధర్ యాదవ్, పాలెం శేషంరాజు యాదవ్, వినోద్ శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజనల్ పిఆర్ఓ రవికుమార్, ఏపీఆర్వో ఖాదర్ మస్తాన్ సేవలు అభినందనీయం : డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖలో డివిజనల్ పిఆర్ఓగా విధులు నిర్వహిస్తూ, ఒంగోలు డి పి ఆర్ వోగా బదిలీ అయిన ఎస్ రవికుమార్, ఏపీఆర్ఓగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఖాదర్ మస్తాన్ సేవలు అభినందనీయమని డిప్యూటీ డైరెక్టర్ పి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం నెల్లూరులోని డిఐపిఆర్వో కార్యాలయంలో ఆత్మీయ అభినందన సభ ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఐపిఆర్వో కార్యాలయ అధికారులు రవికుమార్, ఖాదర్ మస్తాన్ పనితీరును ప్రశంసించారు. డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డివిజనల్ పిఆర్ఓగా రవికుమార్, ఏపీఆర్ఓగా ఖాదర్ మస్తాన్ అంకితభావం, నిజాయితీతో పనిచేశారని కొనియాడారు. అనంతరం రవికుమార్, ఖాదర్ మస్తాన్‌ను డిడి వేణుగోపాల్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో



డివిజనల్ పిఆర్ఓ శ్యాంకుమార్, ఏవిఎస్ శివరాంప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాయబ్, పిఆర్వో వినోద్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ భవాని, రికార్డు అసిస్టెంట్ శోభన్ బాబు, ఫోటోగ్రాఫర్లు గురు ప్రసాద్, గిరి, టెక్నీషియన్లు షేక్ కాలేషా, సాయినాథ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ డా. వి.ఎస్. వెంకటేశ్వర్‌కు ఘన సత్కారం

**తిరుపతి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా కలెక్టర్‌గా రెండేళ్లపాటు విశిష్ట సేవలందించిన డాక్టర్ వి.ఎస్. వెంకటేశ్వర్‌ను శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో బీజేపీ, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరదయ్యపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు దిలీప్ రాయల్, తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి, తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గం అడ్వకేట్ ఎస్. నాగరాజు, బీజేపీ యువ మోర్చా నాయకులు అన్వేష్, కలిసి కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, తిరుపతి జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనలో డాక్టర్ వి.ఎస్. వెంకటేశ్వర్ అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పరిపాలన అందించారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత బాధ్యతల్లోనూ ఇదే నిబద్ధతతో విశిష్ట సేవలందించి మరిన్ని విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, శ్రీ కలియుగ వేంకటేశ్వర స్వామి, శ్రీకాళహ స్తీశ్వర స్వామి, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని వారు ప్రార్థించారు.

# తొలి తిరుపతికి ఒక్కరోజు ఆదాయం రూ. 1.90 లక్షలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం తొలి తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ శృంగారవల్లభ స్వామి దేవస్థానంలో శనివారం సుమారు 12 వేలు మంది భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. శనివారం కావడంతో స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరణ చేసి విశేష పూజలు ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు నిర్వహించారు. కాగా శనివారం ఆలయానికి వచ్చిన ఆధాయం రూ. 1,90,526గా ఆలయ అధికారి వడ్డి శ్రీనివాస రావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 1,26,880, అన్నదాన విరాళాల ద్వారా రూ. 37,091, కేశ ఖండన ద్వారా రూ. 4,480, తులా భారం ద్వారా రూ. 440, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 21,675 లు వెరశి రూ. 1,90,526 లు ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. దేవస్థానం తరుపున భక్తులకు ఉదయం పులిహోర ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సుమారు 3 వేల మంది భక్తులు మధ్యాహ్నం అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులు క్యూ కట్టి స్వామివారి దర్శనం కోసం ఎదురు చూసారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, ధర్మకర్తల మండలి చైర్మన్ మెయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, గ్రామస్తులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు.

# జ్ఞానమ్మ కండ్రిగ ఎస్టీ కాలనీ సందర్శించిన నరేంద్ర దండి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** తొట్టంబేడు మండలంలోని జ్ఞానమ్మ కండ్రిగ ఎస్టీ కాలనీని జనసేన నాయకులు నరేంద్ర దండి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ప్రతి అర్హుడికి ఆధార్ కార్డు, ప్రతి పౌరుడికి ఓటు హక్కు అందే వరకు తాను నిరంతరం కృషి చేస్తామన్నారు. అలాగే ఆయన రాష్ట్ర ఎస్టీ నాయకుడు కోటయ్య కృషికి అభినందించారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని జ్ఞానమ్మ కండ్రిగ ఎస్టీ కాలనీని సందర్శించి స్థానిక ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనులకు ఇప్పటికీ ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ లేకపోవడం, మరికొందరికి ఆధార్ ఉన్నప్పటికీ ఓటర్ ఐడీ లేకపోవడం వంటి అత్యంత ప్రాథమిక సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ అంశంపై సంబంధిత బసవయ్య పాలెం వీఆర్వో రవితో చర్చించగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆధార్ కలిగిన అర్హులందరికీ వెంటనే ఓటర్ ఐడీ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తామని, అలాగే ఆధార్ లేని వారికి ముందుగా ఆధార్ నమోదు పూర్తి చేసి, అనంతరం ఓటర్ ఐడీ ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాథమిక సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి, గిరిజనుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్న కోటయ్య సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నామన్నారు. ప్రజల మౌలిక హక్కులు, సంక్షేమం మరియు ప్రభుత్వ సేవలు ప్రతి అర్హుడికి చేరేలా జనసేన పార్టీ తరపున తన కృషి నిరంతరం కొనసాగుతుందన్నారు.

# అల్లూరి త్యాగం చిరస్మరణీయం

## - ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి - అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరల దాష్టీకానికి ఎదురొడ్డి దేశం కోసం ప్రాణ త్యాగానికి సైతం లెక్క చేయని మన్యం వీరుడు, విప్లవ జ్యోతి అల్లూరి సీతా రామరాజు చిరస్మరణీయుడని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు అన్నారు. అల్లవరం మండలం రెల్లుగడ్డలో శనివారం అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు త్యాగం, దేశభక్తి ఎప్పటికీ స్మరణీయమని ఎమ్మెల్యే కొనియాడారు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, శ్రీగిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన అల్లూరి యువత రంకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. అల్లూరి ధైర్య సాహసాలు, దేశభక్తి, ఆశయ సాధన యువతకు స్ఫూర్తిదాయక మని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, చంటి రాజు, దాట్ల గోపీరాజు, పశ్చిమాల ఏడుకొండలు, సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి, కాకిలేటి సూరిబాబు, మామిడిశెట్టి శ్రీరామ్, సాంబ, రాయుడు రాంబాబు, నడింపల్లి సుబ్బరాజు, కె రాము, ధానయ్యానాయుడు, జి బాల, అల్లవరం మండల కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఈ ఏపీ సెట్‌లో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు




**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఏపీ ఈఏపీ సెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళా శాల విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన ఏపీ ఈ ఏపీ సెట్ పరీక్షలలో అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను దక్కించుకు న్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విభాగాలలో కళాశాల విద్యార్థి నులు విజయకేతనం ఎగుర వేయడంతో శనివారం ప్రిన్సి పాల్ డాక్టర్ సాధనాల శాంతిరాజశ్రీ అధ్యక్షతన తల్లిదండ్రుల సమక్షం లో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. ఏపీఈఏపి సెట్ 2026 ప్రవేశ పరీక్షా ఫలితాలలో అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించిన 17 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వారిని అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యా ర్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శాంతిరాజశ్రీ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశా లకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధిస్తూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులను అన్ని రంగాల్లోనూ తీర్చిదిద్దుతున్న అధ్యా పకులను అభినందించారు.

# మానవత్వాన్ని చాటుకున్న జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** విధి నిర్వహణలోనే కాకుండా మానవ త్వంలోనూ ఆదర్శంగా నిలుస్తూ అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ మరోసారి తన సున్నిత మనసును చాటుకున్నారు. శుక్ర వారం మాడుగులలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న సందర్భంగా, బంగారుమెట్ట వద్ద రహదారి పక్కన కురుస్తున్న వర్షంలో బస్సు కోసం వేచి చూస్తున్న పలువురు విద్యార్థులను కలెక్టర్ విజయ క్రిష్ణన్ గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపించి వారి వివరాలు తెలుసుకుని, వారిని తన కారులో ఎక్కించుకుని బంగారుమెట్ట జంక్షన్ నుంచి చిన్నప్పనపాలెం వరకు సురక్షితంగా దింపించారు. విద్యార్థులు వర్షంలో ఇబ్బంది పడకుండా వెంటనే స్పందించి వారికి లిఫ్ట్ ఇవ్వడం అక్కడి స్థానికులను ఆకట్టుకుంది. కలెక్టర్ చూపిన మానవత్వం, బాధ్యతాయుతమైన స్పందనకు స్థానికులు, ప్రజలు అభినందనలు తెలిపారు.



# శృంగార వల్లభునికి బిసీవై జాతీయ అధ్యక్షులు ప్రత్యేక పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామిని బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారి వడ్డి శ్రీనివాసరావు, ఆలయ పండితులు ఆలయ మర్యాదల చొప్పున ఆహ్వానం పలికారు. అనంతరం రామచంద్ర యాదవ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న వారిలో బిసివై పార్టీ నాయకులు, రామచంద్ర యాదవ్ అభిమానులు ఉన్నారు.

# యలహంక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ తదితర విద్యా సామాగ్రి పంపిణీ








**బాపట్ల, (రాజధాని వార్తలు):** యెలహంకలోని చౌడేశ్వరి లేఅవుట్‌లో ఉన్న నీలకంఠేశ్వర తెలుగు, కన్నడ & తమిళ ప్రభుత్వ సహాయ పాఠశాలలో చదువుతున్న పిల్లలకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, జియామెట్రీ బాక్స్ మరియు స్టేషనరీ సామగ్రి పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ద్వారా అమలు చేస్తున్న స్కూల్ బ్యాగ్ కిట్స్ పంపిణీ కార్యక్రమం, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సస్టైనబుల్ డెవలప్ మెంట్ గోల్స్‌లో ముఖ్య మైనదైన నాణ్యమైన విద్య లక్ష్యానికి అనుగుణంగా కొనసాగుతోంది. ఆర్థిక పరిమితుల కారణంగా విద్యకు దూరమయ్యే ప్రమాదంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల పిల్లలను గుర్తించి, వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా సమాన విద్యావకాశాలను కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. విద్య ప్రతి పిల్లవాడి మౌలిక హక్కు అనే భావనతో, చదువులో వెనుకబడి ఉన్న పిల్లలను ముందుకు తీసుకు వచ్చే దిశగా ఈ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోంది. బెంగళూరు నార్త్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న అవసరమైన పిల్లలను గుర్తించి, వారి అవసరా లను ప్రత్యక్షంగా తెలుసుకొని, వారికి తగిన సహాయం అందించడం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సేవా విధానంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ విధంగా విద్యను బలోపేతం చేయడం ద్వారా పిల్లల భవిష్యత్తును మాత్రమే కాకుండా, సమాజం మొత్తాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు రాజర్షి డా. రుద్రరాజు వేంకటరవి పాల్గొని పిల్లలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. భవిష్యత్తులో వారు ఎలా అభివృద్ధి చెందాలి, మానవత్వంతో ఎలా జీవించాలి, వ్యక్తిత్వ వికాసం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రేమ, శాంతి మరియు ఆనందంతో జీవించే విలువలను అలవర్చు కోవాలని పిల్లలకు బోధించారు. ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. శివరాజు మాట్లా డుతూ, పిల్లలతో మమేకమవడం, వారి అవసరాలను గుర్తించి సహాయం చేయడంలో అపారమైన ఆనందం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ సామర్థ్యానికి అనుగుణంగా మానవతా మరియు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైతే, సమాజంలో మరియు దేశంలో సానుకూల మార్పు తప్పక వస్తుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్యపై పెట్టుబడి పెట్టడం ద్వారా మాత్రమే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇదే UNO SDGs యొక్క మూల స్ఫూర్తి అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్టీలు కొప్పోలు డానియల్, శ్రీధర్.బి, తిమ్మ, షిలో రాజు, పాఠశాల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు రెడ్డి రాణి, ఉపాధ్యాయులు, సహాయక సిబ్బంది మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సంపాదకీయం

## భారతదేశ అభివృద్ధి విజయాల వైపు చూస్తున్న ఇండోనేషియా ; ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఉత్సాహం

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2026 జూలై 6-8 తేదీలలో ఇండోనేషియాలో పర్యటించనున్నారు. ఇది రెండు దేశాల మధ్య భాగస్వామ్యం సంప్రదాయ సహకారానికి అతీతంగా సాగుతున్న తరుణంలో జరుగుతోంది. నేడు, ఇండోనేషియా భారత్ ను కేవలం వ్యూహాత్మక భాగస్వామిగా మాత్రమే కాదు, సాంకేతికత, విధానపరమైన ఆలోచనలు, అభివృద్ధి పరిష్కారాల కోసం నమ్మకమైన వనరుగా భావిస్తోంది. ఆహార భద్రత, డిజిటల్ పరిపాలన నుంచి ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, రక్షణ వరకు భారత్‌లో విజయవంతమైన ప్రజా విధాన నమూనాలు ఇండోనేషియా స్వీయ అభివృద్ధి ప్రయాణానికి విలువైన సూచనలుగా మారుతున్నాయి. ఇక్కడి డిజిటల్ మౌలిక సదుపాయాలు, మన ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), బియ్యం ఫోర్టిఫికేషన్, ఎరువుల రాయితీ సంస్కరణలు, అగ్రిస్టాక్ వంటి సామాజిక సంక్షేమ పథకాలను పరిశీలించి, తెలుసుకునేందుకు ఇండోనేషియాకి చెందిన పలు ప్రతినిధి బృందాలు దేశంలో పర్యటించాయి.

1.డిజిటల్ చెల్లింపులలో భారత నైపుణ్యాన్ని ఇండోనేషి యా ఉపయోగించుకుంటోంది. ప్రతిపాదిత యూపీఐ-క్యూఆర్ఐఎస్ అనుసంధానం రెండు దేశాలలోని ప్రయాణికులు, వ్యాపారాల కోసం మెరుగైన సరిహద్దు చెల్లింపులను అనుమతిస్తుంది. ఈ చొరవ లావాదేవీలను వేగంగా, చౌకగా, మరింత సౌకర్యవంతంగా మార్చడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, డిజిటల్ కామర్స్‌ను పెంచుతుందని భావిస్తున్నారు. 2.ఇండోనేషియాలో వాణిజ్యం లేదా పెట్టుబడి సంబంధాలు ఉన్న భారతీయ వ్యాపారాలకు, ప్రతి సంవత్సరం బాలి, ఇతర ఇండోనేషియాలను సందర్శించే దాదాపు 1.7 మిలియన్ల మంది భారతీయ పర్యాటకులకు, ప్రత్యక్ష యూపీఐ-క్యూఆర్ఐఎస్ కారిడార్ ఉపయోగపడనుంది. 3. ఇండోనేషియాకి చెందిన ఓపెన్ నెట్‌వర్క్, భారతదేశ ఓఎన్డీసీ నమూనా నుంచి ప్రేరణ పొందింది. ఇండోనేషియాలోని 65 మిలియన్లకు పైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల కోసం మరింత బహిరంగ, సమగ్ర డిజిటల్ మార్కెట్‌ను సృష్టించడం దీని లక్ష్యం. బెక్న్ 2.0 ఓపెన్ ప్రోటోకాల్‌పై నిర్మించిన ఐఓఎన్, జూలై 7న జరిగే మోదీ-ప్రబోవో శిఖరాగ్ర సమావేశంలో తన మొదటి ప్రత్యక్ష లావాదేవీతో ప్రారంభం కానుంది. ఇండోనేషియాతో భారతదేశ డిజిటల్ భాగస్వామ్యం ఆ దేశ తదుపరి తరం డిజిటల్ వ్యవస్థను నిర్మించడంలో సహాయపడే దిశగా సాగుతోంది. ఇండోనేషియా ప్రతిష్టాత్మక డిజిటల్ నుసంతారా చొరవ ఒక ఏకీకృత, పరస్పర పనిచేయగల జాతీయ డిజిటల్ మౌలిక సదుపాయాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది, ఈ ప్రయాణంలో భారతీయ సాంకేతిక నైపుణ్యం ముఖ్యమైన భాగస్వామిగా ఎదుగుతోంది. ఆధార్, యూపీఐ, డిజిలాకర్, ఈ-కేవైసీ, ఓఎన్డీసీ విజయానికి కారణమైన భారతీయ డిజిటల్ పరిష్కారాలు ఇప్పుడు ఇండోనేషియా సొంత డిజిటల్ పరివర్తనలో కీలకం కానున్నాయి. ఇది సాంకేతికతను స్వీకరించడం నుంచి బలమైన సంస్థాగత సహకారానికి మారడాన్ని సూచిస్తుంది, సురక్షితమైన, జనాభా-స్థాయి డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలను నిర్మించడంలో భారతీయ సంస్థలు తమ అనుభవాన్ని అందిస్తున్నాయి. ఇండోనేషియా కేవలం సాంకేతిక వినియోగదారునిగా మిగిలిపోకుండా, ఏఎస్ఈఏఎన్ అంతటా డిజిటల్ పరిష్కారాల ఉత్పత్తిదారుగా, ఎగుమతిదారుగా మారాలని ప్రయత్నిస్తోంది. ఓపెన్, సమగ్ర, సార్వభౌమ డిజిటల్ వేదికలను రూపొందించడంలో భారతదేశ దశాబ్దాల అనుభవం ఇండోనేషియాకు విలువైన పాఠాలను అందిస్తుంది. 4.ఆర్థిక మార్కెట్లలోకి కూడా సహకారం విస్తరిస్తోంది. ఏఐ-ఆధారిత మార్కెట్ నిఘా, డిజిటల్ పెట్టుబడి వేదికలు, సాంకేతికతతో నడిచే మూలధన మార్కెట్ సంస్కరణలలో భారతీయ నైపుణ్యాన్ని ఉపయోగించడాన్ని ఇరుపక్షాలు అన్వేషిస్తున్నాయి. సాంకేతికత ద్వారా తన స్టాక్ మార్కెట్లను ఆధునీకరించడంలో భారత సొంత అనుభవం ఇండోనేషియాతో సహకారం కోసం కొత్త మార్గాలను తెరుస్తోంది. 5.ఇండోనేషియా ప్రతిష్టాత్మక ఉచిత పౌష్టికాహార భోజన కార్యక్రమం భారతదేశ మధ్యాహ్న భోజన (పీఎమ్ పోషన్) పథకం నుంచి ప్రేరణ పొందింది. అదేవిధంగా, దాని రెడ్ అండ్ వైట్ విలేజ్ కోఆపరేటివ్స్ చొరవ జన ఔషధి నమూనా ద్వారా సరసమైన మందుల కోసం భారతదేశంతో సహకారాన్ని కోరుతోంది. ఇది గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ సౌలభ్యాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. 6.ఈ భాగస్వామ్యం రక్షణ రంగంలో కూడా విస్తరిస్తోంది. రక్షణ ఉత్పాదకత, సాంకేతిక బదిలీ, సైనిక శిక్షణ, సముద్రయాన సహకారంపై ఇండోనేషియా భారతదేశంతో కలిసి పని చేస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ కింద స్వదేశీ రక్షణ ఉత్పత్తిలో భారత అనుభవం దీర్ఘకాలిక సహకారం కోసం కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. భారతదేశ అభివృద్ధి ప్రయాణం ఇకపై దాని స్వంత పౌరులకే కాక, స్నేహపూర్వక దేశాలకు ఒక నమూనాగా మారుతోంది. ప్రధానమంత్రి మోదీ ఇండోనేషియా పర్యటన సందర్భంగా బలోపేతమవుతున్న ఈ జ్ఞాన భాగస్వామ్యం, ఇరు దేశాల ఆర్థిక వృద్ధి, దీర్ఘకాలిక వ్యూహాత్మక సహకారానికి ఒక బలమైన స్తంభంగా నిలవనుంది.

## పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండల పరిధిలోని నల్లపాలెం గ్రామంలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టాదారు రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మాతృమూర్తి బొజ్జల బృందమ్మ పాల్గొన్నారు. రేణిగుంట తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం... ఘనంగా నివాళులర్పించిన గంట్ల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మన్యం ప్రజల కోసం వీరోచితంగా పోరాటం సాగించడం గిరిజనుల సంక్షేమం భూహక్కుల కోసం బ్రిటిష్ వారిపై పోరాడిన మన్యం విప్లవ వీరుడు, అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, డాక్ యార్డ్ కే టి బి అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ద్వారక బస్ కాంప్లెక్స్ వద్ద శనివారం గంట్ల శ్రీనుబాబు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమర పోరాటంలో గిరిజనుల కోసం ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు పోరాటం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది అన్నారు. 1922 నుంచి 1924 వరకు అల్లూరి వీరోచిత పోరాటం సాగించారన్నారు. గెరిల్లా యుద్ధం చేసి బ్రిటిష్ వారిని గడగడలాడించారన్నారు. 1924లో ఆయనను బ్రిటిష్ వారు దారుణంగా కాల్చి చంపారన్నారు. సీతారామరాజు నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తారు అన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. అదేవిధంగా అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి సైతం ప్రభుత్వం భావితరాలను దృష్టిలో ఉంచుకొని మరింత నిధులు మంజూరు చేసి వాటిని అభివృద్ధి చేయాలని కోరారు.

# కే.వీ.సూర్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థి గర్జన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాహుల్ గాంధీ సూచన ప్రకారం పీసీసీ అధ్యక్షులు వైఎస్. షర్మిల రెడ్డి ఆదేశాలు ప్రకారం డీసీసీ అధ్యక్షులు ఆజ్ఞ ప్రకారం కేవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో దక్షిణ నియోజకవర్గంలో వున్న ఏవిఎన్ కాలేజ్‌లో ప్రతి క్లాస్‌లోని స్టూడెంట్స్‌తో ఎడ్యుకేషన్ మీద మరియు కాంపిటే షన్ ఎగ్జామినేషన్ మీద జరుగుచున్న అవకతవకులు గురించి వివరించడం జరిగినది. ప్రతి విద్యార్థితో క్యూఆర్ కోడ్ ఉపయోగించి వాట్సాప్ గ్రూపులో జాయిన్ చేసాము. ఈ కార్యక్రమంలో ఎస్సి సెల్ నాయకులు కస్తూరి వెంకటరావు, మైనార్టీ నాయకులు హరసద్ బాషా, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ శివ, ఓబీసీ జిల్లా అధ్యక్షులు (కేఎస్ఆర్) శ్రీనివాసరావు, ఓబీసీ ఈస్ట్ అధ్యక్షులు బీవీ. శ్రీనివాసరావు, 39వ వార్డ్ అధ్యక్షులు సైర్ అలీ, యూత్ కాంగ్రెస్ నాయకులు మాణికంఠ 37వ వార్డ్ అధ్యక్షులు కాకర అప్పారావు యూత్ నాయకులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలను తక్షణ పరిష్కరించాలి

### - రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సామర్లకోట మండల కమిటీ నాయకులు డిమాండ్



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల పిఆర్‌సి కమిటీ ఏర్పాటుతోపాటు పెన్షన్‌వాళ్లకు సంబంధించి పెండింగ్లో ఉన్న సమస్యలన్నీ తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సామర్లకోట మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు స్థానిక తహసిల్దార్ కే చంద్రశేఖర్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఆర్వి పల్లేశ్వరరావు, జి వి రాఘవలు మాట్లాడుతూ పెన్షనర్ల ప్రధాన సమస్యలుగా హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేసేలా ముఖ్యమంత్రి చేసిన హామీని నెరవేర్చాలని, బకాయిలు విడుదల చేసి రెండు డిఏలను మంజూరు చేయాలని, పిఆర్సి బకాయిలు చెల్లించాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు వచ్చేలా చట్ట సవరణకు చర్యలు చేపట్టాలని, పాత సిపిఎస్ పద్ధతిని పునరుద్ధరించి, సిపిఎస్ కుటుంబాలకు 121 జీవోను సవరించి వారి కంట్రీ బ్యూషన్‌ను చెల్లించాలని, ఫ్యాన్సలర్లకు గత సంవత్సరం తగ్గించిన అడిషనల్ క్వాంటం పెన్షన్ మంజూరు చేయాలని, గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమే టిక్ అడ్వాన్‌మెంట్ స్కీమ్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్ వేగవంతం చేయాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వ పథకాలలో భాగస్వామ్యం కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీలోపు ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర జేఏసీ కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి తదుపరి కార్యాచరణ నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి ఎండి వి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండలం స్థానిక శ్రీ నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో శనివారం స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రధానోపాధ్యాయురాలు ఎన్.రాజరాజేశ్వరి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి అల్లూరి సేవలను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో జన్మించారని తెలిపారు. ఆయన విద్యాభ్యాసం రామచంద్రపురం, రాజమహేంద్రవరం, కాకినాడ, తుని ప్రాంతాల్లో సాగిందని వివరించారు. చిన్న వయసులోనే దేశభక్తి భావాలు అలవర్చుకుని స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. అడ్డతీగల, రంపచోడవరం, కృష్ణదేవిపేట, చింతపల్లి, రాజవొమ్మంగి తదితర గిరిజన ప్రాంతాల్లో బ్రిటిష్ పాలకుల దమనకాండకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి పోరాటం సాగించిన ధీరుడిగా అల్లూరి సీతారామరాజు నిలిచారని ఆమె చెప్పారు. స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఆయన త్యాగం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశభక్తి, సేవా భావం, ధైర్యసాహసాలు ప్రతి విద్యార్థి జీవితంలో అలవర్చుకోవాల్సిన గొప్ప విలువలని సూచించారు. 1924లో కొయ్యూరులో బ్రిటిష్ అధికారులు అల్లూరి సీతారామరాజును కాల్చి చంపినా, ఆయన ఆశయాలు నేటికీ కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిస్తున్నాయని అన్నారు. విద్యార్థులు అల్లూరి జీవితం, పోరాట పటిమ, దేశభక్తి గురించి తెలుసుకొని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలను వివరిస్తూ ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# ఘనంగా వంగవీటి మోహన్ రంగ జయంతి




**అల్లవరం, (రాజధాని వార్తలు):** సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం వంగవీటి మోహన రంగా చేసిన పోరాటం ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మోహనరంగా జయంతి సందర్భంగా శనివారం అల్లవరం సెంటర్లో మోహనరంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మోహన రంగా ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షిస్తూ నివాళులు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల జనసేన పార్టీ నాయకులు కంకిపాటి వీరబాబు, అడపా రాజారావు, అల్లవరం సొసైటీ అధ్యక్షులు కంకిపాటి గోపి, సుంకర సాయి, బండి గుప్తాపు చిట్టి వెంకన్న, దాసం శేషగిరి, కంకిపాటి సుబ్బారావు, నున్న సూర్రావు, బండిగుప్తాపు సూరిబాల, కాకిలేటి సాయి, మెరికిల నాగేశ్వరరావు, బండి గుప్తాపు బుల్లివెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అల్లూరి 129వ జయంతి వేడుకలు



**కరప, (రాజధాని వార్తలు):** అమర స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం కరప మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు స్వాతంత్ర్య సమరంలో తన ప్రాణాలను అర్పించి దేశభక్తికి ప్రతీకగా నిలిచిన మహనీయుడని కొనియాడారు. బ్రిటిష్ పాలకుల అణచి వేతకు ఎదిరించి ఆదివాసీల హక్కుల కోసం ధైర్య సాహసాలతో పోరాడిన గొప్ప విప్లవ వీరుడని పేర్కొన్నారు. యువత అల్లూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, సేవాభావం, త్యాగనిరతిని అలవర్చుకోవాలని సూచించారు. మహనీయుల స్ఫూర్తితో సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఆర్. ప్రభాకరరావు, సీనియర్ సహాయకుడు టి.సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపిలో ధృతరాష్ట్ర పాలన

### - ధుర్యోధన యువరాజు రాజ్యాంగం
### - మండిపడ్డ జమ్మలమడక నాగమణి

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ధృతరాష్ట్ర కౌగిలిలో నలిగిపోతోందని వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి విమర్శిం చారు. అదే సమయంలో దుర్యోధన యువరాజు రాజ్యాంగంతో ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతోందని మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర పాలనపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు (మావిగన్) రాజధాని ప్రతిపా దనపై కూటమి ప్రభుత్వం ఎందుకు ఉలిక్కి పడుతుందని నిలదీసారు. మావిగన్ ప్రాంతం ఇప్ప టికే అభివృద్ధి చెందిన మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుకోవడం వల్ల కొత్త రాజధాని నిర్మాణ భారాన్ని తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. రహదారులు, రైల్వే, విద్యుత్, నీటి వంటి మౌలిక వసతులు ఇప్పటికే అందుబాటులో ఉండటంతో ప్రభుత్వ వ్యయం తగ్గి, ప్రజాధనం విద్య, వైద్యం వంటి రంగాలకు మళ్లించవచ్చని తెలిపారు. విజయవాడ, గుంటూరు వంటి నగరాలు ఇప్పటికే పరిపాలనకు అనుకూలంగా ఉన్నందున రాజధాని ఏర్పాటు త్వరగా సాధ్యమవుతుందని, గన్నవరం విమానాశ్రయం విస్తరణతో అంతర్జాతీయ విమాన సర్వీసులు, కార్గో హబ్, ఎంఆర్ఓ వంటి సదుపాయాలకు అవకాశం పెరుగుతుందని చెప్పారు. అలాగే మచిలీపట్నం పోర్టు అభివృద్ధి ద్వారా ఎగుమతి-దిగుమతి, లాజిస్టిక్స్, పరిశ్రమల వృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. మూడు నగరాల మధ్య రహదారి, రైలు, మెట్రో వంటి రవాణా వ్యవస్థలు అభివృద్ధి చెందితే సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుని తక్కువ వ్యయంతో దశలవారీగా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చనే వాదన మావిగన్ ప్రతిపాదనకు అనుకూలంగా ఉందని నాగమణి పేర్కొన్నారు.

# 28 ఏళ్ల గ్యాప్ తర్వాత మ్యాజిక్ కాంబో... 'కింగ్ 100' మూవీలో టబు ఎంట్రీ!




టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున కెరీర్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 100వ చిత్రం (కింగ్ 100) ఈ మూవీ గురించి వస్తున్న ఒక్కో అప్‌డేట్ అంచనాలను ఆకాశానికి తీసుకెళ్తోంది. ముఖ్యంగా నాగార్జున సరసన ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించిన అలనాటి అందాల తార టబు.. దాదాపు 28 ఏళ్ల సుదీర్ఘ గ్యాప్ తర్వాత మళ్లీ నాగ్ సరసన ఈ సినిమాలో కనిపించబోతోందనే వార్త టాలీవుడ్‌లో సెన్సేషన్‌గా మారింది. అయితే ఈసారి ఆమె రోల్ చాలా డిఫరెంట్‌గా ఉంటుందని టాక్. ఆ ఇంట్రెస్టింగ్ డీటెయిల్స్ ఇప్పుడు చూద్దాం..

**ఊహించని రోల్‌లో కనిపించనున్న టబు:**

గతంలో నాగార్జున, టబు కాంబినేషన్ అనగానే ప్రేక్షకులకు వారిద్దరి మధ్య కెమిస్ట్రీ, రొమాంటిక్ సీన్స్ మూవీస్ నిన్నేపెళ్లాడతా, ఆవిడా మా ఆవిడే, ఇలా ఎన్నో గుర్తొస్తాయి. అప్పట్లో వీరిద్దరికీ ఇండస్ట్రీలో ఒక ప్రత్యేకమైన అభిమాన వర్గం ఉంది. అయితే, ఈ 100వ సినిమాలో టబు హీరోయిన్‌గా కాకుండా.. నెగటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ ప్రతినాయిక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఇన్నాళ్లూ వీరిని లవర్స్‌గా చూసిన ఆడియన్స్‌కు.. ఇప్పుడు నాగ్‌కు అపోజిట్‌గా టబు విలనిజం చూపించబోతోందనే బజ్ సినిమాపై క్యూరియాసిటీని రెట్టింపు చేసింది.

**కథేంటి.. ఎవరి దర్శకత్వం?:**

అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇండస్ట్రీ టాక్ ప్రకారం.. పేదరికం నుంచి స్వయంకృషితో ఒక పెద్ద సంపన్నుడిగా ఎదిగిన ఓ వ్యక్తి జీవిత కథ ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందట. ఇక ఇందులో తండ్రీకూతుళ్ల మధ్య సాగే ఎమోషన్స్ సినిమాకు మెయిన్ హైలెట్ అని తెలుస్తోంది. అలాగే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో సుష్మిత భట్ కూడా ఒక కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ సైలెంట్‌గా శరవేగంగా సాగుతోంది.

**జూలై 10 తర్వాతే అసలైన అప్‌డేట్:**

తాజాగా అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' సినిమా ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున.. తన 100వ సినిమా గురించి ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే హామీ ఇచ్చారు. జూలై 10 తర్వాత 'కింగ్ 100'కు సంబంధించిన అఫీషియల్ అప్‌డేట్స్ ఇస్తానని ఆయన ప్రకటించారు. ఇక దీంతో జూలై మధ్య వారం నుంచి ఈ సినిమాకు సంబంధించిన అసలైన వివరాలు, అలాగే టబు క్యారెక్టర్‌పై వస్తున్న వార్తల్లో నిజమెంత అనే విషయాలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది.

**బాక్సాఫీస్ దగ్గర కింగ్ మార్క్ ర్యాంపేజ్:**

నాగార్జున తన కెరీర్‌లో ఎన్నో మైల్ స్టోన్ సినిమాలు చేశారు. ఇప్పుడు రాబోతున్న ఈ 100వ సినిమా ఆయనకు మరింత స్పెషల్. 28 ఏళ్ల తర్వాత టబు లాంటి వెర్సటైల్ యాక్ట్రెస్ ఈ ప్రాజెక్ట్‌లోకి రావడం, అది కూడా విలన్ పాత్ర అనగానే అంచనాలు నెక్స్ట్ లెవెల్‌కు వెళ్లిపోయాయి. ఇక అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవన్నీ ఇండస్ట్రీ బజ్ అయినప్పటికీ.. ఒకవేళ ఇదే నిజమైతే మాత్రం థియేటర్లలో నాగ్, టబుల మైండ్ బ్లోయింగ్ పర్ఫార్మెన్స్‌తో బాక్సాఫీస్ దగ్గర కింగ్ మార్క్ ర్యాంపేజ్ చూడటం ఖాయం.

# 'రాకా' తర్వాత అట్లీ మళ్లీ తెలుగులోనే..!



కోలీవుడ్ దర్శకుడు అట్లీ జవాన్‌తో పాన్ ఇండియా స్టార్ దర్శకుడిగా మారి పోయాడు. అంతకుముందు విజయ్‌తో అట్లీ తెరకెక్కించిన బిజిల్, మెర్సల్, తేరి సినిమాలు ఏ స్థాయిలో హిట్ అయ్యాయో తెలిసిందే. అందుకే అట్లీ నుంచి వస్తున్న సినిమా అనగానే అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. జవాన్ తర్వాత కాస్త గ్యాప్ తీసుకున్న దర్శకుడు అట్లీ ప్రస్తుతం తెలుగు టాప్ స్టార్ హీరో అల్లు అర్జున్‌తో 'రాకా' సినిమాను చేస్తున్న విషయం తెల్సిందే. ఈ ఇద్దరు పాన్ ఇండియా స్టార్స్ కలిసి చేస్తున్న పాన్ ఇండియా మూవీ కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుందని అభిమానులు మాత్రమే కాకుండా మీడియా వర్గాల వారు, ఇండస్ట్రీకి చెందిన వారు చాలా నమ్మకంగా చెబుతున్నారు. 'రాకా' నుంచి వచ్చిన పోస్టర్, గ్లిమ్స్‌తో అంచనాలు భారీగా పెరిగి పోయాయి. వచ్చే ఏడాది చివరికి రాకా సినిమా రావడం ఖాయం అని యూనిట్ సభ్యులు అంటున్నారు.

**అల్లు అర్జున్ రాకా సినిమా కోసం...**

రాకా సినిమా రిలీజ్ తర్వాత అట్లీ తన కొత్త సినిమాను ప్రారంభిస్తాడు. అప్పటి వరకు అట్లీ తన కొత్త సినిమా గురించి ఎలాంటి ప్రకటన చేయడు. కానీ ఆయన తదుపరి సినిమా ఎవరితో అనే విషయంలో మాత్రం ఒక నిర్ణయం తీసుకుంటాడని తెలుస్తోంది. 2028 ఆరంభంలోనే అట్లీ కొత్త సినిమా పట్టాలు ఎక్కే విధంగా ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. అట్లీ టీం అందుకు తగ్గట్టుగా ఏర్పాటు చేస్తూ ఉంటుందట. అట్లీ రాకా సినిమా విషయమై సీరియస్‌గా ఉన్నప్పటికీ భవిష్యత్తు సినిమాలపైనా కొంత దృష్టి పెడతాడని అంటున్నారు. అందులో భాగంగానే జవాన్ 2 సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ చర్చలు అప్పుడప్పుడు జరుపుతున్నాడని సమాచారం అందుతోంది. అంతే కాకుండా కమల్‌హాసన్, సల్మాన్ ఖాన్‌తో ఒక సినిమాను చేయాలనే ఉద్దేశంతో స్టోరీ లైన్‌ను రెడీ చేసుకున్నాడట. ఆ స్క్రిప్ట్ పూర్తి చేయడానికి సమయం పట్టే అవకాశం ఉంది.

**రాకా సినిమా వీఎఫ్ఎక్స్ కోసం...**


అట్లీ 'రాకా' షూటింగ్‌ను త్వరలోనే పూర్తి చేయనున్నాడని సమాచారం అందుతోంది. దాదాపు పది నెలల పాటు వీఎఫ్ఎక్స్ వర్క్ ఉంటుందనే వార్తలు వస్తున్నాయి. అంటే వచ్చే ఏడాది ఆరంభంలోనే అట్లీ రాకా షూటింగ్ పూర్తి చేసి ఫ్రీ అయ్యే అవకాశం ఉంది. అట్లీ గతంలో ఎన్టీఆర్‌తో సినిమా చేయబోతున్నట్లుగా వార్తలు వచ్చాయి. రాకా సెట్ కాకుంటే ఎన్టీఆర్‌తో సినిమాను అట్లీ కన్ఫర్మ్ చేసుకునే వాడు అని ఆయన సన్నిహితులు చెబుతూ ఉంటారు. ఎన్టీఆర్‌తో అట్లీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. డ్రాగన్ సినిమా తర్వాత ఎన్టీఆర్ చేయబోతున్న సినిమా విషయంలో క్లారిటీ రాలేదు. కానీ ఎన్టీఆర్, అట్లీ కాంబోలో మూవీ ఉండే అవకాశం ఉందనే వార్తలు వస్తున్నాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే 2028 లో అట్లీ, ఎన్టీఆర్ కాంబోలో మూవీ పట్టాలెక్కి రెండేళ్ల తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

**ఎన్టీఆర్, అట్లీ కాంబోలో మూవీ...**

అల్లు అర్జున్‌తో రూపొందిస్తున్న 'రాకా' సినిమా సూపర్ హిట్ అయితే కచ్చితంగా అట్లీతో వర్క్ చేసేందుకు టాలీవుడ్ స్టార్ హీరోలు అంతా కూడా ఆసక్తి చూపించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఎన్టీఆర్‌తో అట్లీ ఒక సినిమా అనుకున్నాడు కనుక మరే హీరోతో కమిట్ కాకుండా ఎన్టీఆర్‌తోనే సినిమాను చేసే అవకాశాలు ఉన్నాయనే వార్తలు వస్తున్నాయి. కానీ అట్లీ నుంచి చిన్న క్లూ కూడా ఈ విషయమై రావడం లేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారం కేవలం పుకార్లే అని అట్లీ టీం కొట్టి పారేస్తున్నప్పటికీ అభిమానులు మాత్రం ఈ వార్తలు నిజం కావాలని కోరుకుంటున్నారు. నిజం అయ్యే అవకాశాలు లేకపోలేదు అంటూ కొందరు అంటున్నారు.

మరి ఈ విషయం గురించి అట్లీ లేదా ఎన్టీఆర్ స్పష్టత ఇచ్చేనా చూడాలి. ఎన్టీఆర్, అట్లీ కాంబో అంటే సహజంగానే పాన్ ఇండియా రేంజ్‌లో అంచనాలు పెరుగుతాయి. కనుక ఈ కాంబో ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులో అయినా రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. మరి రాకా తర్వాత అట్లీ మళ్లీ తెలుగు సినిమా చేసే అవకాశం ఉందా అనేది కాలమే నిర్ణయించాలి.

# బీచ్ సన్‌సెట్‌కు మరింత గ్లామ్ జోడించిన అనన్య పాండే



బాలీవుడ్ యంగ్ సెన్సేషన్, జెన్-జీ ఐకాన్ అనన్య పాండే తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. సముద్ర తీరాన, సూర్యాస్తమయ సమయం గోల్డెన్ అవర్‌లో ఆమె దిగిన కొన్ని స్టన్నింగ్ ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. గ్లామర్, ఎలిగాన్స్ కలబోసినట్లున్న ఈ సన్‌సెట్ లుక్‌లో అనన్య ఎనర్జీ మరియు స్టార్ క్వాలిటీ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆ బ్యూటిఫుల్ లుక్ విశేషాలు మీకోసం.

**అదిరిపోయే అవుట్‌ఫిట్.. సమ్మర్ గ్లామర్:**

ఈ ఫొటోషూట్‌లో అనన్య పాండే స్టైలింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. ఆమె ఒక స్లీక్ బ్లాక్ బాడీసూట్‌ను ధరించి దానికి కాంబినేషన్‌గా బోల్డ్ ఆరెంజ్ అండ్ బ్లాక్ ప్యాటర్న్ ఉన్న మినీ ర్యాప్ స్కర్ట్‌ను మ్యాచ్ చేసింది. సముద్రపు గాలికి ఎగురుతున్న జుట్టు, ముఖంపై ఒక అందమైన చిరునవ్వు, ఒక చేతితో మెడను తాకుతూ ఆమె ఇచ్చిన కాన్ఫిడెంట్ పోజ్ యూత్‌ఫుల్ సమ్మర్ గ్లామర్‌ను పర్‌ఫెక్ట్‌గా ప్రతిబింబిస్తోంది. బ్యాక్‌డ్రాప్‌లో ఉన్న సముద్రం, సూర్యాస్తమయ కాంతులు ఆమె అందాన్ని మరింత పెంచేశాయి.

**స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' నుండి క్రేజీ స్టార్ వరకు:**

2019లో వచ్చిన 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2' సినిమాతో టైగర్ ష్రాఫ్ సరసన బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది అనన్య పాండే. ఫస్ట్ సినిమాతోనే తన నటనతో, క్యూట్ లుక్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఇక ఆ తర్వాత పతి పత్ని ఔర్ వో, ఖాలీ పీలీ, నెట్‌ఫ్లిక్స్ హిట్ సిరీస్ 'కాల్ మీ బే' వంటి చిత్రాలతో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించింది. ముఖ్యంగా 2023 లో వచ్చిన 'ఖో గయే హమ్ కహా' చిత్రంలో ఆమె నటనకు విమర్శకుల నుంచి ప్రశంసలు దక్కాయి.

**సోషల్ మీడియా క్వీన్.. చేతినిండా ప్రాజెక్టులు:**

అనన్య పాండే కేవలం సినిమాలతోనే కాకుండా తన అద్భుతమైన ఫ్యాషన్ సెన్స్, క్రేజీ డాన్స్ నంబర్లతో సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుంది. కమర్షియల్ సినిమాలతో పాటు కంటెంట్ ఉన్న సినిమాలను కూడా బ్యాలెన్స్ చేస్తూ దూసుకుపోతోంది. ప్రస్తుతం ఆమె చేతిలో పలు క్రేజీ బాలీవుడ్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇక విజయ్ దేవరకొండ రాబోయే 'రౌడీ జనార్ధన' చిత్రంలో ఆమె ఒక స్పెషల్ సాంగ్‌లో కనిపిస్తారని టాక్.

**ఫ్యాషన్ ఐకాన్‌గా అనన్య మార్క్:**

సముద్ర తీరాన అనన్య పాండే చేసిన ఈ సన్‌సెట్ హడావిడి నెటిజన్లకు ఫుల్ విజువల్ ట్రీట్ ఇచ్చిందని చెప్పొచ్చు. గ్లామరస్ అవుట్‌ఫిట్‌లోనూ ఎంతో కేర్‌ఫ్రీగా, రేడియంట్‌గా కనిపిస్తూ ఫ్యాషన్ ప్రియులకు సరికొత్త గోల్స్ సెట్ చేసింది. అటు సినిమాలతో, ఇటు ఇలాంటి స్టైలిష్ ఫొటోషూట్స్‌తో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే అనన్య.. రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి..

# అఖిల్ 'లెనిన్' బిజినెస్ ఇలా..!



అఖిల్ అక్కినేని 'లెనిన్' సినిమా మరో మూడు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. 'ఏజెంట్' వంటి డిజాస్టర్ తర్వాత అఖిల్ నుంచి సినిమా అంటే సహజంగానే ప్రేక్షకుల్లో కాస్త అనుమానాలు ఉండటం ఖాయం. కానీ అఖిల్ ఒకటి కాదు రెండు కాదు ఏకంగా మూడు ఏళ్లు గ్యాప్ తీసుకుని, దాదాపుగా రెండేళ్లు కనీసం మీడియా ముందుకు రాకుండా, అభిమానులను కలువకుండా చేసిన మూవీ 'లెనిన్'. దాంతో లెనిన్‌పై అంచనాలు పెరిగాయి. అంతే కాకుండా లెనిన్ సినిమాను ప్రకటించినప్పటి నుంచి కూడా పాజిటివ్ బజ్ క్రియేట్ అవుతూ వచ్చింది. అభిమానులు మాత్రమే కాకుండా అన్ని వర్గాల వారు అఖిల్ ఈసారి లెనిన్‌తో హిట్ కొట్టేలా ఉన్నాడు అన్నట్లుగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అందుకే అన్ని ఏరియాల్లోనూ అఖిల్ మార్కెట్ రేంజ్‌ను మించి లెనిన్ బిజినెస్ చేసిందని బాక్సాఫీస్ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది.

**లెనిన్ ప్రీ రిలీజ్ బిజినెస్...**

సోషల్ మీడియాలో లెనిన్ సినిమా గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో లెనిన్ మూవీ ప్రీ రిలీజ్ బిజినెస్ అంటూ కొన్ని లెక్కలు కనిపిస్తున్నాయి. వాటిల్లో కొన్ని నమ్మదగ్గ సోషల్ మీడియా అకౌంట్స్ నుంచి తీసుకున్న లెక్కల ప్రకారం లెనిన్ సినిమా మొత్తం ప్రీ రిలీజ్ బిజినెస్ రూ.30 కోట్లుగా తెలుస్తోంది. అఖిల్ గత చిత్రాలు తీవ్రంగా నిరాశ పరిచినప్పటికీ కేవలం థియేట్రికల్ రైట్స్ ద్వారా ఏకంగా రూ.30 కోట్లు బిజినెస్ చేయడం అంటే మామూలు విషయం కాదు. ఈ మధ్య కాలంలో యంగ్ హీరోల సినిమాల బిజినెస్‌తో పోల్చితే అఖిల్ లెనిన్ మూవీ చేసిన బిజినెస్ చాలా బాగుంది అనేది విశ్లేషకుల మాట. థియేట్రికల్ రైట్స్ ద్వారా రూ.30 కోట్లు రావడంతో నిర్మాతకు చాలా పెద్ద రిలీఫ్‌గా చెప్పుకోవచ్చు. సినిమా భారీగా ప్రీ రిలీజ్ బిజినెస్ చేయడంతో రూ.35 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. సినిమాకు హిట్ టాక్ వస్తే ఆ రూ.35 కోట్లు పెద్ద కష్టం కాకపోవచ్చు అనేది కొందరి మాట.

**అఖిల్ అక్కినేని లెనిన్ సినిమా రిలీజ్..**

ఇండస్ట్రీ వర్గాల వారు, బాక్సాఫీస్ వర్గాల వారి నుంచి అందుతున్న సమాచారం ప్రకారం అఖిల్ లెనిన్ మూవీని నైజాం ఏరియాకి గాను దాదాపుగా రూ.8.5 కోట్లకు ప్రముఖ నిర్మాణ సంస్థ కొనుగోలు చేసింది. అఖిల్‌కు ఉన్న క్రేజ్ నేపథ్యంలో నైజాంలో రూ.10 కోట్లు ఖాయం అని అంటున్నారు. ఇక ఆంధ్రాలో లెనిన్ సినిమాకు గాను 9 కోట్లకు కొనుగోలు చేయడం జరిగిందట. సీడెడ్‌లో సినిమాను నాలుగు కోట్లకు ప్రముఖ పంపిణీదారుడు కొనుగోలు చేశాడని సమాచారం అందుతోంది. కేవలం తెలుగు రాష్ట్రాల్లో థియేట్రికల్ రైట్స్ ద్వారా రూ.22 కోట్ల నుంచి రూ.23 కోట్ల వరకు లెనిన్ రాబట్టినట్లు తెలుస్తోంది. ఇక దేశంలోని ఇతర రాష్ట్రాల్లో లెనిన్ విడుదల కాబోతుంది,

**లెనిన్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున...**

ఈ రూ.30 కోట్లకు ఆడియో రైట్స్, శాటిలైట్ రైట్స్, ఓటీటీ రైట్స్ ద్వారా వచ్చే మొత్తం అధనం అనే విషయం తెల్సిందే. నిర్మాతలకు లెనిన్ విడుదలకు ముందే దాదాపుగా రూ.50 కోట్లు తెచ్చి పెట్టి ఉంటుంది అనేది విశ్లేషకుల అభిప్రాయం. సినిమా హిట్ అయితే అప్పుడు ఈ నెంబర్స్ పూర్తిగా మారిపోయి నిర్మాతలకు మంచి లాభాలను తెచ్చి పెట్టే అవకాశం ఉంది. అఖిల్‌కు జోడీగా ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో ఈ సినిమాను నాగవంశీ, నాగార్జునలు సంయుక్తంగా నిర్మించారు. జులై 10న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతున్న ఈ సినిమాతో అఖిల్ కెరీర్ బిగ్గెస్ట్ హిట్‌ను అందుకుంటాడు అనే నమ్మకంను ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు.

# నికార్సైన దేశభక్తికి నిదర్శనం అల్లూరి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** నికార్సైన దేశభక్తికి నిదర్శ నం, అసాధారణ పోరాట పటిమకు నిలువెత్తు రూపం అల్లూరి సీతారామరాజు అని కోటలో గల స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి ఎ సత్యమూర్తి పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గుండెల్లో రగులుతున్న దేశభక్తికి, ఉక్కులాంటి ధైర్యానికి అల్లూరి సీతారామ రాజు ప్రతీక అని భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ గడ్డపై ఉద్భవించిన గొప్ప సాయుధ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు గురు ప్రసాద్‌తో కలసి ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి ఎ సత్యమూర్తి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య భారతి సమన్వయకర్త కన్నయ్య, శ్రీ వాసవి కంటోన్మెంట్ ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు డిమ్స్ రాజు, సమితి ఉపాధ్యక్షులు కాగుపాటి నారాయణమూర్తి, వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్ర దేవి, కార్యక్రమ సమన్వయకర్త, అసిస్టెంట్ ప్రొఫెసర్ హరికృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# రోశయ్యకు ఘనంగా నివాళులు




**విజయనగరం, (రాజధాని వార్తలు):** కొణిజేటి అనే పేరుకు ఘనమైన చరిత్ర ఉంది. రోశయ్య అంటే క్రమశిక్షణ, నిజాయితీ, నిబద్ధత మొదలైన మంచి గుణాలకు పెట్టింది పేరు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా, ఎన్ని పదవులు చేపట్టినా, అవినీతి మరక లేని గొప్ప రాజకీయవేత్త రోశయ్య. రోశయ్య జయంతి సందర్భంగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వామి ద్రోహం, వెన్నుపోట్లు వంటి అవలక్షణాలు ఏవీ లేని సద్గుణ సంపన్నుడు రోశయ్య. తనకు అప్పగించిన ఏ బాధ్యతనైనా సమర్ధవంతంగా విజయవంతంగా పూర్తి చేయగల సత్తా కలిగిన నాయకుడు రోశయ్య. వరుసగా ఏడుసార్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సాధించిన ఒకే ఒక వ్యక్తి రోశయ్య. ముఖ్యమంత్రి పదవి వచ్చినప్పుడు ఎంత హుందాగా ప్రవర్తించారో, అధిష్టానం ఆ పదవి నుండి తప్పుకోమని చెప్పినప్పుడు కూడా అంతే హుందాగా వ్యవహరించారు. అందుకే గవర్నర్ పదవి ఆయన్ని వెతుక్కుంటూ వచ్చింది. ఏ రోజూ పదవుల కోసం పాకులాడని మహోన్నత వ్యక్తి రోశయ్య. పుష్కలమైన మేధాసంపత్తితో పాటు, నిజాయితీ, స్వామి భక్తి కలిగిన నాయకులు రోశయ్య. అసెంబ్లీలో ప్రభుత్వానికి ఏదైనా గట్టి సంక్షోభం ఎదురైతే... దానికి సానుకూల 'ముగింపు పలికే బాధ్యతను రోశయ్యకే అప్పగించేవారు. అంటీ అంటనట్లు, నొప్పించక తానొవ్వక, లౌక్యంగా.. విపక్షానికి చురకలు వేస్తూనే ఒక ప్రకటన చేసి దానికి అంతటితో ముగింపు పలికేలా చేయడమే రోశయ్య స్టైల్. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు బోండా రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు తవ్వ మోహన్ రావు, మహిళా విభాగం ఉత్తరాంధ్ర అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సముద్రాల గిరిజా ప్రసన్న, జిల్లా శాఖ మీడియా కమిటీ చైర్మన్ శ్రీకాకుళం శంకరరావు, జిల్లా శాఖ కార్యదర్శి బాలు, కోశాధికారి కుమార్ రాజా, జిల్లా శాఖ సలహాదారు గురు ప్రసాద్, జిల్లా శాఖ నాయకులు ఆకి సూర్య ప్రకాష్ తదితరులు రోశయ్య గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

# ఉదారత చాటుకున్న గ్రామస్తులు

## - రిటైర్డ్ వి.ఆర్.ఓ బైరెడ్డి నారాయణ, ఎంపీటీసీ బైరెడ్డి లావణ్య

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని ఎం. గుమడాము గ్రామానికి చెందిన ఆవాల రమణ ఇటీవల అనకాపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు కోల్పోయాడు. దీంతో ఆ గ్రామానికి చెందిన రిటైర్డ్ వి.ఆర్.ఓ బైరెడ్డి నారాయణ 5000 రూపాయలు, ఎం.పీ.టీ.సీ బైరెడ్డి లావణ్య వెయ్యి రూపాయలు ఆర్థిక సాయం చేసి తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. అలాగే ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రమణ కుమార్తె భార్గవి ఇంజనీరింగ్ పూర్తయ్యే వరకు అవసరమయ్యే ఆర్థిక సాయం కూడా అందిస్తామని ఈ సందర్భంగా రిటైర్డ్ విఆర్ఓ బైరెడ్డి నారాయణ, కుమారుడు బైరెడ్డి సూర్యనారాయణ ప్రకటించారు. ప్రతి ఏడాది కూడా 5 వేలు రూపాయల



సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బైరెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి : రీజనల్ హెడ్ పైడిరాజు

**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండలం మార్కొండ పుట్టి గ్రామంలో యూనియన్ బ్యాంక్ వినియోగదారులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం రీజనల్ హెడ్ పైడిరాజ తెలిపారు. మార్కొండపుట్టి గ్రామంలో యూనియన్ బ్యాంక్ (పునర్నిర్మాణం) చేపట్టారు. ఈ కార్యక్రమానికి యూనియన్ బ్యాంక్ శ్రీకాకుళం రీజనల్ హెడ్ పైడిరాజ హాజరై బ్యాంకును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలలో యూనియన్ బ్యాంక్ సుమారు 23 లక్షల కోట్ల రూపాయలు వ్యాపారం చేస్తుందన్నారు. సేవింగ్స్, డిపోజిట్స్, రుణ సదుపాయాలపై వివరించారు. యూనియన్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను, బ్యాంక్ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ అస్యూరెన్స్ హెడ్ ఎం.విశ్వనాధం, మార్కొండపుట్టి బ్యాంకు హెడ్ సునీల్ కుమార్, వినియోగదారులు



చొక్కాపు బుచ్చినాయుడు, దామెర మధుసూదనరావు, వేమూరి కోటేశ్వరరావు, పోతుల దుర్గారావు, తేలు శ్రీరాములునాయుడు, బొంగు వాసుదేవరావు, జుమ్ము సింహాచలం, పొట్నూరు వెంకట్రావు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గజపతినగరం బి.ఎస్.ఎన్.ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజిలో చోరీ

## - ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పురిటి పెంట గ్రామ రహదారిలో గల బి.ఎస్.ఎన్.ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు గజపతినగరం ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న తలుపులను పగలగొట్టి టెలిఫోన్ ఎక్స్చేంజిలోకి ప్రవేశించారని ఆయన చెప్పారు. ముందుగా సీసీ కెమెరాను ధ్వంసం చేసి అక్కడ ఉన్న ఒక్కొక్కటి 40 మీటర్ల పొడవు గల 60 ఆర్.ఎఫ్ కేబుల్‌లను దొంగలించారని బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజి జే.టి.ఓ బి సురేష్ కుమార్ చెప్పారని, ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు అన్నారు. గజపతినగరం బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్చేంజ్ జే.టి.వో బి.సురేష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# మంత్రి ఆదేశాలతో డ్రైనేజీ సమస్య పరిష్కారం

## - మంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేసిన స్థానిక ప్రజలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని పురిటిపెంట గ్రామంలో కల్వర్టు వద్ద డ్రైనేజీ చెత్తాచెదారాలతో పేరుకుపోయింది. వర్షాకాలం సమీపిస్తున్న వేళ వరద నీరు ప్రవహించుకపోవడంతో ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. సమస్యను గుర్తించిన రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమస్య పరిష్కరించాలని జాతీయ రహదారి విభాగపు అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు సమన్వయంతో, సంయుక్తంగా సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో శనివారం పారిశుద్ధ్య కార్మికులతో చెత్తాచెదారాన్ని తొలగించి, వరద నీరు ప్రవహించేలా కల్వర్టు శుభ్రపరిచారు. వర్షాకాలంలో డ్రైనేజీ చెత్తాచెదారాలతో పూడుకు పోయినట్లయితే నీరు నిల్వ ఉండి దోమలు పెరిగిపోవడంతో పాటు వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. వర్షపు నీటితో పాటు, మురుగునీరు సమస్య కూడా ఏకధాటిగా పరిష్కారం కావడం జరిగింది. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దూర దృష్టితో వర్షాకాలానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయటం పట్ల గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రజలు సైతం డ్రైనేజీలలో చెత్తాచెదారాలతో పాటు ప్లాస్టిక్ కవర్లు పడవేయకూడదన్నారు. అలాగే ప్రజలకు పంచాయతీ విభాగపు అధికారులు, సిబ్బంది పారిశుధ్యం మెరుగుదలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలం సమయంలో ఇంటితో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నట్లయితే దోమలు పెరిగి మలేరియా జ్వరాల బారిన పడాల్సి వస్తుందని కాబట్టి ప్రతి ఒక్కరు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

# డీపీఆర్వోలుగా జానకమ్మ, శ్రీనివాస్‌లకు పదోన్నతి, బదిలీ





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డివిజనల్ పీఆర్వోలుగా పనిచేస్తున్న ఎస్.జానకమ్మ, ఐ.శ్రీనివాస్‌లకు డీపీఆర్వోలుగా పదోన్నతి లభించింది. జానకమ్మ జిల్లాలో ఎపిఆర్వోగా, డివిజనల్ పీఆర్వోగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. ఆమె డిపిఆర్వోగా పదోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా దాదాపు ఏడాది క్రితం డివిజనల్ పీఆర్వోగా అనకాపల్లి నుంచి జిల్లాకు వచ్చిన శ్రీనివాస్ కూడా డిపిఆర్వోగా పదోన్నతి పొంది, పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ అయ్యారు.

పదోన్నతి పొందిన ఈ ఇద్దరు అధికారులకు సమాచార శాఖ ఏ.డి పి.గోవిందరాజులు, ఇతర అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్ సెంటర్ నందు శివాజీ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఇన్ఫోమెట్రి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో, ఆ సంస్థ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ శ్రీమతి శోభా నాగ్ దాతృత్వంతో అవసరమైన ఐదుగురు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఈరోజు నెల్లూరులోని నోవా బ్లడ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్ఫోమెట్రి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అసోసియేట్ డేటా ఇంజనీర్ హరీష్ కుమార్ హాజరై లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్ నాయుడు మాట్లాడుతూ, విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ స్వదేశంపై ప్రేమతో సమాజ సేవా కార్యక్రమాలకు నిరంతరం సహకరిస్తున్న శోభా నాగ్ సేవాభావం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, ముఖ్యంగా నెల్లూరు జిల్లాలో చేపట్టే సేవా కార్యక్రమాలకు శివాజీ యూత్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ వాలంటీర్లుగా సేవలందించేందుకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి అవకాశం కల్పించిన శోభా నాగ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఆమెను తమకు పరిచయం చేసిన అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తమ పదో తరగతి క్లాస్ మేట్, చిరకాల మిత్రుడు హేమతుల్లాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా పూడిపర్తి గ్రామానికి చెందిన నడమల రవణయ్య, శ్రీనివాసులు, మోడ గుంట గ్రామానికి చెందిన చెరుకూరి సుబ్రహ్మణ్యం, వావిలేటి పాడుకు చెందిన గరితోటి వెంకమ్మ, నెల్లూరు శివారు ప్రాంతానికి చెందిన దామర్ల జాలయ్యలకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. శివాజీ యూత్ ఫౌండేషన్ గతంలో కూడా నోవా బ్లడ్ సెంటర్ ద్వారా 12మందికి పైగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందజేసిందని, రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ ఫౌండేషన్ ఫౌండర్ అండ్ సీఈఓ మోపూరు భాస్కర్ నాయుడు, మోపూరు కార్తికేయ నాయుడు, ఆములూరు జితేంద్ర, దూడల సుధీర్, కార్తీక్ గనకాల సుమ, అమన్ జమ్ అధినేత మహాతజ్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జీవితం ఆదర్శం కావాలి

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్టణంలో డివైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా బళ్ళ మార్కెట్ సెంటర్లో, స్థానిక బలు సుల పేటలోని అల్లూరి విగ్రహాలకు పూలదండలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా మాజీ నాయకులు బాలం శ్రీనివాస్ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు మన్యం ప్రజల సమస్యలపై పోరాడుతూ గిరిజన హక్కుల కోసం బ్రిటిష్ సామ్రాజ్యం ఎదిరించి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారన్నారు. నేటి పాలకులు బాక్సైట్ గనులు కోసం కొండ కోనల నుంచి నేషనల్ హైవేస్ నిర్మించి ఆదానిలాంటి పెట్టుదారులకు దారాదత్తం చేయడానికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. నేటి యువత అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం గోవిందరాజు, బాలం సత్తిబాబు, మూలయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, దళిత నాయకులు నేతల హరిబాబు, కరణం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



# భావితరాలకు ఆదర్శంగా నిలవాలి

## - పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఐపీఎస్ అధికారి సత్తిబాబు



**అల్లవరం, (రాజధాని వార్తలు):** విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ జనరల్ మోకా సత్తిబాబు అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం తాడికోన గ్రామంలోని వీరమ్మ చెరువు పెదపేట ప్రాథమిక పాఠశాలలకు సత్తిబాబు సౌజన్యంతో ఉచిత నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తి, క్రమశిక్షణతో చదివి ఒక్కొక్క ఆఫీసరు కావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు గోసంగి బంగారాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి, రహమతుల్లా, గెడ్డం ప్రదీప్, దాసరి సత్తిబాబు, నందిక సిద్ధార్థ కుమార్, ఉండ్రు సత్యనారాయణ, బడుగు నాగార్జున, నీతిపూడి రాంబాబు, దాసరి వెంకట మోహన్, ఎస్ఎంసి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీతం విద్యార్థినికి ఏఐసీటీఈ యశస్వి స్కాలర్‌షిప్‌లో రూ.50 వేల స్కాలర్‌షిప్

## - జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఈసీఈ విద్యార్థిని పత్తిగుల్ల గాయత్రి

**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలకు చెందిన విద్యార్థిని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. కళాశాలలో ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదువుతున్న పత్తిగుల్ల గాయత్రి ప్రతిష్టాత్మక ఏఐసీటీఈ యశస్వి స్కాలర్‌షిప్కు ఎంపికై రూ. 50,000 నగదు స్కాలర్‌షిప్‌ను పొందింది. దేశంలోని ప్రతిభావంతులైన కోర్ ఇంజినీరింగ్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అందిస్తున్న యశస్వి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గాయత్రి కృషి, ప్రతిభకు నిదర్శనమని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా సీతం డైరెక్టర్ డా.మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ, జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌ను సాధించడం విద్యార్థినికి మాత్రమే కాకుండా కళాశాలకు కూడా గర్వకారణమన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయి అవకాశాలను అందిపుచ్చుకునేలా సీతం ఎల్లప్పుడూ మార్గదర్శకత్వం అందిస్తోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి గాయత్రిని అభినందిస్తూ, ఆమె విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈసీఈ విభాగాధిపతి డా.టి దామోదర్ నాయుడు, చీఫ్ అకాడమిక్ అడ్మినిస్ట్రేటర్ ప్రొఫెసర్ సాయిరాం పట్నాయక్, అధ్యాపకురాలు ప్రొఫెసర్ వి.ఎన్. శిరీష, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు గాయత్రిని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, ఆధునిక ప్రయోగశాలలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విద్యార్థి కేంద్రిత శిక్షణతో పాటు జాతీయ స్థాయి స్కాలర్‌షిప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను సీతం నిరంతరం ప్రోత్సహిస్తోందని కళాశాల యాజమాన్యం తెలిపింది.




# రైతు సంక్షేమానికి అండగా నిలవాలి

## - వైద్య శిబిరంలో ఎమ్మెల్యే, జిల్లా సహకార అధికారులు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** రైతులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు జి. మేడపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) చేపట్టిన ఉచిత వైద్య శిబిరం అభినందనీయమని, సహకార సంఘాలు రైతు కుటుంబాలకు అండగా ఉండాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకా యల చినరాజప్ప, జిల్లా సహకార అధికారి బి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం, సహకార వారోత్సవాల సందర్భంగా శనివారం జి మేడపాడు గ్రామంలోని సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి ఎమ్మెల్యే మాట్లాడారు. తాను గత 40 ఏళ్లుగా సహకార రంగంతో అనుబంధం కలిగి ఉన్నప్పటికీ, రైతులు వారి కుటుంబాల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ స్థాయిలో వైద్య శిబిరాన్ని నిర్వహించడం అరుదుగా చూశానన్నారు. రైతుల సంక్షేమంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా సంఘం ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాకినాడ జిల్లా సహకార అధికారి (డీసీవో) బి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, జి.మేడపాడు సొసైటీలో రైతులకు రుణాలు, ఎరువులు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలులోనూ ముందంజలో ఉందన్నారు. రైతు కుటుంబాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వైద్య శిబిరం నిర్వహించడం సంఘం సేవా దృక్పథానికి నిదర్శనమని కొనియాడారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కాకినాడ ఏరియాలోని లోటస్ ఆసుపత్రి వైద్య బృందం, వెటర్నరీ వైద్య సిబ్బంది, వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పార్దేష్, కాకినాడ లక్ష్మీ హాస్పిటల్స్ రైజిల్ డాక్టర్ నారాయణమూర్తి డాక్టర్ వంశీ, వేట్లపాలెం పిహెచ్సి ఎమ్ ఎల్ హెచ్ సీ హెచ్ పి స్టీఫెన్, సరోజిని ఏఎన్ఎం రామకుమారి, జయలక్ష్మి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, సుమారు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వ హించి గర్భిణీలు బాలింతలకు సైతం మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు కాకినాడ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాసాచార్యుల చౌదరి (శ్రీను బాబు), జి.మేడ పాడు సొసైటీ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవనారాయణ, డైరెక్టర్ జనా వెంకట్రావు, అనపర్తి డిస్ట్రిక్ట్ కమిటీ వైస్ చైర్మన్ గోలి కృష్ణమూర్తి, జి మేడపాడు ఎత్తిపోతల పథకం ఉపాధ్యక్షులు పాలకుర్తి చినబాబు, సామర్లకోట సొసైటీ అధ్యక్షులు పైన్ని శ్రీనివాసరావు, జనసేన జిల్లా నాయకులు పంచమర్తి రాజన్న, సొసైటీ కార్యనిర్వహణాధికారి ఎం శ్వేత, సహకార శాఖ అధికారులు, వివిధ సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అయోధ్య రామ మందిరంలో నిధులు స్వాహాపై విచారణ జరిపించాలి

## - సర్ పేరుతో ఓటర్లను తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలి

## - ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ పాలక్ వర్మ, సిడబ్ల్యూసి సభ్యుడు రుద్రరాజు




**అమలాపురం, (రాజధాని వార్తలు):** అయోధ్య రామ మందిరంలో నిధుల స్వాహాపై సుప్రీం కోర్ట్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఏఐసీసీ జాయింట్ సెక్రెటరీ, ఏపీ రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ పాలక్ వర్మ డిమాండ్ చేశారు. నిధుల స్వాహా వ్యవహారంలో ఎన్నో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయని వివరించారు. అయోధ్య రామ మందిరంలో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఈ వ్యవహారం అయోధ్య రామ మందిరానికి మాయని మచ్చని పాలక్ వర్మ అన్నారు. సర్ పేరుతో నిజమైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అమలాపురం ప్రెస్ క్లబ్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా శాఖ సమీక్ష సమావేశం జిల్లా శాఖ అధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్ర కమిటీ సభ్యులు పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమి ష్టిగా కృషి చేయాలని పనిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. అలాగే ఓటర్ల జాబితా ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. పార్టీని అభివృద్ధి చేసుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఆదరణ చూపేందుకు సిద్ధంగా ఉన్నారనే విషయం తమ పరిశీలనలో స్పష్టమైందని ఏఐసీసీ సభ్యురాలు పాలక్ వర్మ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించిన పాలక్ వర్మ, ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. నీట్ పరీక్ష నిర్వహణలో విఫలమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 3 వేల మంది విద్యార్థులతో మమేకమై రాహుల్ గాంధీ క్యూ ఆర్ కోడ్ రూపొందించి విద్యార్థులు సమస్యల ఫీడ్ బ్యాక్ కోసం వెబ్సైట్ ఏర్పాటు చేశారన్నారు. గిడుగు రుద్రరాజు మాట్లాడు తూ సర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి, వారి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మండల, జిల్లా కమిటీల ఏర్పాటు, పార్టీ బలోపేతంపై చర్చ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# గ్రోత్ ఇంజన్ నాయకుడు లోకేష్

మనిషై పుట్టిన వాడు కారాదు మట్టి బొమ్మ.. పట్టుదలే ఉంటే కాగలడు మరో బ్రహ్మ.. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు .. మహా పురుషులౌతారు.. తరతరాలకు వెలుగౌతారు.. అదుగో అతడే నారా లోకేష్.రాజకీయాల్లో చాలా మంది నాయకులు ఉంటారు.కానీ కొందరు మాత్రమే రాష్ట్ర భవిష్యత్తు కోసం నిద్రలేని రాత్రులు గడుపుతారు. నేడు మంత్రి నారా లోకేష్ చేస్తున్నది అదే. రోజు దక్షిణ కొరియా ప్రభుత్వం యువనేతను ఆహ్వానించి ఆయనతో పెట్టుబడుల అంశంపై చర్చించడం ఆషామాషి విషయమేమి కాదు. ప్రపంచ దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన దేశం దక్షిణ కొరియా. అలాంటి దేశం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తో కలిసి పని చేయడానికి ముందుకు రావడంమన రాష్ట్రంపై పెరిగిన నమ్మకానికి తార్కాణం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, భారీ పెట్టుబడుల ఆకర్షణ మరియు లక్షలాది ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అవిరళ కృషి చేస్తున్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదాన్ని దాటి, పనులను వేగవంతం చేసేందుకు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే విధానాన్ని ఆయన అమలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఐటి శాఖమంత్రి నారా లోకేశ్ చేపడుతున్న ఈ పెట్టుబడుల వేట, యువతకు భారీగా ఉపాధి అవకాశాలను తెచ్చిపెడుతున్నాయి. తాజా గాదక్షిణ కొరియా పర్యటనలో ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్. ఏపీలో పెట్టుబడులే లక్ష్యంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుసగా భేటీ జరుపుతున్న చర్చలు విజయవంతం కావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని బడా కంపెనీలు తరలి వస్తాయనే నమ్మకం ప్రజానీకానికి కలుగుతోంది. ఇందులో భాగంగా షూఆల్స్ ఛైర్మన్ లీ చియాంగ్-గెన్‌తో లోకేశ్ సమావేశమై. ఏపీలో షూఆల్స్ పాదరక్షల యూనిట్ పనులు వేగవంతం చేయాలని, ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని షూఆల్స్‌కు మంత్రి ఆహ్వానం పలికారు. ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. మంత్రి లోకేశ్ విజ్ఞప్తిపై షూఆల్స్ ఛైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ.. ఏపీ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇవ్వడం రాష్ట్రానికి శుభపరిణామమనే చెప్పాలి.. ఏపీలో రూ.300 కోట్లతో షూఆల్స్ యూనిట్ ఏర్పాటు కానుంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి లభించనుంది. నారా లోకేష్ బాబు తెలుగుదేశం పార్టీకి మాత్రమే కాదు, రాష్ట్ర భవిష్యత్తుకూ ఒక "గ్రోత్ ఇంజన్" లాంటి నాయకుడనే చెప్పాలి. సాధారణంగా అధికారంలో ఉన్నవారు ఇంట్లోనే ఉండి రాజకీయాలు చేయాలని చూస్తారు.



కానీ లోకేష్ బాబు నిరంతరం రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ఆహర్నిశలు శ్రమిస్తున్నారు.. దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో సుమారు 25% వాటా మన రాష్ట్రానికి వచ్చేలా చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం 24/7 శ్రమిస్తున్న లోకేష్ బాబు, రాబోయే రోజుల్లో ప్రతి ఇంటినుంచి ఒక పారిశ్రామికవేత్తను అందించే దిశగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకుని ఆదిశగా అడుగులు వేయడం అభినందనీయం. ఆయన నాయకత్వ పటిమపై పారిశ్రామికవేత్తలకు ఉన్న నమ్మకమేహౌఇందుకు కారణమని చెప్పాలి. అభివృద్ధి వికేంద్రీకరణ అభివృద్ధి అంటే ఒక్క ప్రాంతానికి పరిమితం కాకూడదని యువనేత లోకేష్ నమ్ముతారు. అందుకే అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పిస్తున్నారు. రాయలసీమను డ్రోన్ పాట్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీక్ కేంద్రంగా మారుస్తున్నారు. అమరావతిని క్వాంటం వ్యాలీ, రాజధాని నిర్మాణంతో అభివృద్ధి చేస్తున్నారు. వైజాగ్ లో డేటా సెంటర్లు, కాగ్నిజెంట్, టీసీఎస్ వంటి దిగ్గజ ఐటీ కంపెనీల ఏర్పాటుతో ప్రముఖ పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 26 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా కంపెనీలను ఆహ్వానిస్తున్నారు. గతంలో డావోస్ పర్యటనలు కేవలం ఫోటో షూట్లకే పరిమితమయ్యేవి. కానీ లోకేష్ బాబు పర్యటన వల్ల ఆర్ఎంఆర్ వంటి సంస్థలు విశాఖలో 10 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గ్లోబల్ క్యాపబిలిటీ పార్క్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. మాటల్లో కాకుండా చేతల్లో అభివృద్ధి చూపిస్తున్న లోకేష్ బాబు, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించే భవిష్యత్తు నాయకుడు అనడంలో సందేహం లేదు. లోకేష్ బాబు కేవలం రాష్ట్రానికి పరిమితం కాకుండా, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్ పెంచుతున్నారు. ఆయన కృషి వల్లం ప్రపంచ స్థాయి ఇన్వెస్టర్లకు మన రాష్ట్రంపై గట్టి నమ్మకం ఏర్పడింది. అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాల్లో లోకేష్ పర్యటించి అక్కడి దిగ్గజ కంపెనీలతో మాట్లాడారు. ఫలితంగానే కాగ్నిజెంట్. డేటా సెంటర్లు వంటివి రాష్ట్రానికి వస్తున్నాయి. దావోస్ పర్యటనలో ఆర్ఎంజడ్ లాంటి సంస్థలను ఒప్పించి భారీ పెట్టుబడులు సాధించారు. అమరావతిని కేవలం రాజధానిగానే కాకుండా. భవిష్యత్ తరాల కోసం క్వాంటం వ్యాలీ" గా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ కేవలం ఉద్యోగాలే కాదు, అత్యాధునిక సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యం కూడా యువతకు అందుతాయి. గతంలో అందరూ పనులు. సులభంగా అవ్వాలని (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అనేవారు. కానీ లోకేష్ బాబు ఒక అడుగు ముందుకు వేసి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో పనులను వేగవంతం చేస్తున్నారు. పెట్టుబడిదారులకు ఇచ్చే ఇన్సెంటివ్స్ (ప్రోత్సాహకాలు) విషయంలో ఎటువంటి ఆలస్యం లేకుండా, వెంటనే చెల్లించేలా "ఎస్క్రో అకౌంట్లు' ఏర్పాటు చేసి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచారు. కేవలం ఐటీ మాత్రమే కాదు, ఆర్సెలర్ మిట్టల్ వంటి స్టీల్ దిగ్గజం 2000 ఎకరాల్లో భారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 28 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. సీఎం చంద్రబాబు అశయం ప్రకారం ప్రతి ఇంట్లో ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలి. ఒక పెద్ద కంపెనీ వస్తే దాని చుట్టూ వందలాది చిన్న అనుబంధ పరిశ్రమలు వస్తాయి. తద్వారా స్థానికులకు అపారమైన అవకాశాలు దక్కుతాయి. అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు సమానంగా పంచడం (వికేంద్రీకరణ). యువతకు నైపుణ్యాన్ని అందించడం, మరియు పారిశ్రామిక వేగంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పట్టుదలతో లోకేష్ బాబు అహర్నిశలు శ్రమిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడిదారులను వర్సెంటేజీ కోసం వేధించారు. దీనివల్ల లూలు గ్రూప్, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, జాకీ వంటి అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయిన సంగతి విదితమే., దీంతో ఏపీ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింది గు. కేవలం అప్పులు పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే సంక్షేమ పథకాలు అమలు చేయలేమని.. రాష్ట్రంలో సంపద సృష్టించాలంటే పరిశ్రమలు రావాలన్నదే చంద్రబాబు, లోకేష్‌ల ఆలోచన.. కంపెనీలను బెదరించకుండా, వాటికి అవసరమైన భూమిని, ప్రోత్సాహకాలను అందిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందనేది వారి నమ్మకం. లోకేష్ బాబు సుమారు. 3132 కిలోమీటర్ల పాదయాత్ర చేసి, రాష్ట్రంలోని ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఏ ప్రాంతానికి అవసరముందో ఆయన దగ్గర 'ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్' (నేరుగా సేకరించిన సమాచారం) ఉండడం వల్లే నేడు పారిశ్రామిక రంగం వైపు ఆంధ్రప్రదేశ్ దూసుకు పోతున్నది.. పాదయాత్రలో ప్రజల మనోభావాలను అర్థం చేసుకున్న లోకేష్ బాబు, ఇప్పుడు విదేశాల్లో తిరుగుతూ ఆయా ప్రాంతాలకు తగిన పరిశ్రమలను తీసుకువస్తున్నారు. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు ఇన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ఆయన ఏకైక లక్ష్యం. ప్రతిపక్షం ఫేక్ ఆధారాలతో ఇన్వెస్టర్లను భయపెట్టాలని చూస్తున్నా లోకేష్ బాబు మీద ఉన్న నమ్మకంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు ఏపీకి రావడానికి ఉత్సాహం చూపుతున్నారు. సీఎం చంద్రబాబుకు తోడుగా లోకేష్ చాలా కంపెనీలను ఏపికి తీసుకొచ్చే పనిలో పడ్డారు. ఒకే జిల్లాకు పెట్టుబడులను పరిమితం చేయకుండా.. అన్ని ప్రాంతాలకు పెట్టుబడులను సమానంగా తీసుకొస్తున్నారు. రెండేళ్ళపాలనలో రాష్ట్రానికి రూ 20 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకే దక్కుతుంది.రాష్ట్రం పారిశ్రామిక ప్రగతిలో సరికొత్త రికార్డులను సృష్టించడం వెనుక ఆ తండ్రి, తనయుల కృషి ఎంతో ఉంది. పరిశ్రమల స్థాపనతో బాటు 20 లక్షల ఉద్యోగాల కల్పన అనేది ఎన్నికల హామీ నినాదం కాదని అది ఒక చారిత్రాత్మక బాధ్యతగా స్వీకరించిన లోకేష్ ఆదిశగా అడుగులు వేయడం రాష్టాభివృద్ధి పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం.రాష్ట్రం కోసం ప్రపంచం ముందు నిలబడి పెట్టుబడులు తీసుకు రావడం, యువతకు ఉద్యోగావకాశాలు సృష్టించడమే నాయకత్వం ఆ నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకున్న లోకేష్ ధ్వర్యంలో ఎపి పారిశ్రామిక రంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆశిద్దాం.

**వాసంశెట్టి సుభాష్,**
కార్మిక శాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan